# తొలి అక్షరం

తెలుగు దిన పత్రిక

చైర్మెన్ & చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 02 సంచిక - 90 పేజీలు - 6 శనివారం 22 ఫిబ్రవరి 2025


## లోకల్‌బాయ్ నానికి చట్టప్రకారం శిక్ష తప్పదు: సజ్జనార్

తొలి అక్షరం/హైదరాబాద్,ఫిబ్రవరి21: సోషల్‌మీడియా వాడకం పెరిగిపోయినప్పటి నుంచి దాని వల్ల ఎంత మంచి జరిగిందో.. అంతే చెడు జరిగింది అనడంలో తప్పు లేదు. దాన్ని సక్రమంగా వినియోగించే వాళ్లు ఉన్నారు.. దుర్వినియోగం చేసే వాళ్లూ ఉన్నారు. ఇలా దుర్వినియోగం చేసే వారిలో బెట్టింగ్ యాప్‌ల వాళ్లు ముందు వరుసలో ఉంటారు. కొందరు యూట్యూబర్లను కూడా ఈ బెట్టింగ్ యాప్‌ల నుంచి డబ్బు తీసుకొని వాటిని ప్రమోట్ చేస్తున్నారు. ఇది చూసిన వాళ్ల ఫాలోవర్లు.. ఆ బెట్టింగ్ యాప్‌ల ఉచ్చులో పడిపోతున్నారు. ఓవైపు బెట్టింగ్ యాప్‌లకు దూరంగా ఉండాలని పోలీసులు, ప్రభుత్వాలు ఎంత చెప్పిన.. కొందరు మాత్రం అది పెడ చెవిన పెడుతున్నారు. అలాంటి యూట్యూబర్‌కు ఆర్టీసి ఎండీ సజ్జనార్ వార్నింగ్ ఇచ్చారు. తెలుగులో మంచి పాపులారిటీ ఉన్న యూట్యూబర్ లోకల్‌బాయ్ నాని.. తరచూ బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేయడంపై సజ్జనార్ మండిపడ్డారు. లోకల్‌బాయ్ నానిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన ఎపి డిజిపిని కోరారు.





# కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం

● మహిళలకు ఏడాదికి రెండు క్వాలిటీ చీరలు : సీఎం రేవంత్ ● ఇందిరమ్మ ఇండ్లకు శంకుస్థాపన చేసిన సీఎం రేవంత్ ● పాలమూరు ప్రాజెక్టులను ఎండబెట్టిన ఘనత కెసిఆర్‌దే ● ఉమ్మడి జిల్లా అభివృద్ధి కోసం ఎన్ని కోట్లయినా ఖర్చు చేస్తా ● మెడికల్ కాలేజీకి చిట్టెం నర్సిరెడ్డి పేరు ఖరారు

తొలి అక్షరం/షాద్ నగర్, ఫిబ్రవరి21: నారాయణ పేట జిల్లా అప్పక్కపల్లిలో ఇందిరమ్మ ఇండ్లకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఎస్సీ మహిళ బంగళి దేవమ్మ ఇందిరమ్మ ఇంటికి శంకుస్థాపన చేశారు రేవంత్. నారాయణపేట నియోజకవర్గంలో 13 గ్రామాల్లో 859 లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇంటి పట్టాలు ఇచ్చారు రేవంత్. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని జనవరి 26న ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఇందిరమ్మ ఇల్లు కట్టుకునే వారికి రూ. 5 లక్షలు ఇవ్వనుంది ప్రభుత్వం. నాలుగేళ్లలో 20లక్షల ఇళ్లను టార్గెట్ గా పెట్టుకున్న ప్రభుత్వం తొలి విడతలో 72 వేల ఇండ్లను మంజూరు చేసింది. మొదటి విడతలో ఇందిరమ్మ ఇండ్లు కట్టుకునే వారు పునాదులు తీసి బేస్ మెంట్ నిర్మిస్తే ఫస్ట్ ఫేజ్ అమౌంట్ రూ.1 లక్ష లబ్ధిదారుల ఖాతాలో వేయనుంది. రూ.5 లక్షలను బేస్ మెంట్ దశలో రూ.లక్ష, గోడలు కట్టిన తరువాత రూ.1. 25 లక్షలు, స్లాబ్ పూర్తయ్యాక రూ.1.75 లక్షలు, ఇల్లు పూర్తయిన తరువాత రూ.లక్షను ప్రభుత్వం లబ్ధిదారుడి బ్యాంకు ఖాతాలో జమ చేస్తుంది. వచ్చే నెలలో ఈ ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో అప్పటి వరకు స్కీమ్ అమలుకు దశల వారీగా నిధులు రిలీజ్ చేయనుంది.కోటి మంది మహిళలను కోటీశ్వరులను వివరాలు 2లో



- పవార్‌కు చేయి అందించి.. మంచినీళ్లు ఇచ్చిన మోడీ

## మరాఠీ సాహిత్య సమ్మేళనంలో
# ఆసక్తికర ఘటన

తొలి అక్షరం/న్యూఢిల్లీ,ఫిబ్రవరి 21: దేశ రాజధాని దిల్లీలో జరుగుతున్న 98వ అఖిల భారత మరాఠీ సాహిత్య సమ్మేళనంలో ఆసక్తికర ఘటన జరిగింది. విజ్ఞాన్ భవన్ వేదికగా జరుగుతున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఎన్సీపీ అధినేత శరద్ పవార్ నడుమ ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. శరద్ పవార్ కుర్చీలో కూర్చోవడానికి మోదీ సాయం చేయడంతో పాటు, తన చేతితో స్వయంగా గ్లాసులో నీళ్లు నింపి పవార్‌కు అందించారు. దీంతో అక్కడున్న వారంతా చప్పట్లతో హర్షం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ పాల్గొన్నారు. మరాఠి భాషకు వివరాలు 2లో

## కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన మాజీ ఎంఎల్ఎ కోనేరు కోనప్ప




## భూపాలపల్లి కోర్టు
# ఉత్తర్వులను కొట్టివేయాలి

☛హైకోర్టును ఆశ్రయించిన కేసీఆర్, హరీశ్‌రావు



తొలి అక్షరం/హైదరాబాద్,ఫిబ్రవరి21: మేడిగడ్డ బ్యారేజీ కుంగిన వ్యవహారంలో భారాస అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు దాఖలు చేసిన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. రాజలింగ మూర్తి ఫిర్యాదు మేరకు భూపాలపల్లి కోర్టు విచారణకు స్వీకరించి నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. భూపాలపల్లి జిల్లా కోర్టు ఉత్తర్వులను కొట్టివేయాలని కోరుతూ కేసీఆర్, హరీశ్‌రావు హైకోర్టును ఆశ్రయించారు. విచారణ సందర్భంగా కేసీఆర్, హరీశ్‌రావు తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ జిల్లా కోర్టుకు విచారణార్హత లేకున్నా ఉత్తర్వులు జారీచేసినట్లు చెప్పారు. భూపాలపల్లి జిల్లా కోర్టులో ఫిర్యాదు చేసిన రాజలింగమూర్తి మృతి చెందినట్లు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. మీడియా ద్వారా తనకు ఈ విషయం తెలిసిందని న్యాయమూర్తి చెప్పారు. వివరాలు 2లో




# కృష్ణా యాజమాన్య బోర్డు భేటీ వాయిదా

☛ఎపి హాజరకాక పోవడంతో నిర్ణయం

తొలి అక్షరం/హైదరాబాద్, ఫిబ్రవరి 21 : కృష్ణా నది యాజమాన్య బోర్డు ప్రత్యేక, అత్యవసర సమావేశం వాయిదా పడింది. సమావేశానికి తాము హాజరుకాలేమని, వాయిదా వేయాలని ఏపీ అధికారులు కోరారు. దీంతో సమావేశాన్ని సోమవారానికి బోర్డు వాయిదా వేసింది. వివరాలు 2లో

## ఒక్కరోజు కూడా కాలేదు...
# అప్పుడే విమర్శలా..?

☛మాజీ సిఎం అతిశీ వ్యాఖ్యలపై సిఎం రేఖాగుప్తా మండిపాటు






# చైనాలో కొవిడ్ మాదిరి కొత్త వైరస్ గుర్తింపు !

తొలి అక్షరం/న్యూఢిల్లీ,ఫిబ్రవరి 21:చైనాలో కొవిడ్ మాదిరిగా ఉన్న కొత్త వైరస్‌ను పరిశోధకులు గుర్తించారు. జంతువుల నుంచి మానవులకు సంక్రమించే ముప్పు ఉన్నట్టు భావిస్తున్నారు. గబ్బిలాల్లో గుర్తించిన ఈ కొత్త వైరస్‌ను హెచ్‌కేయూకోవ్ 2 గా పేర్కొన్నారు. ఇది కొవిడ్ 19 కి కారణమైన సార్స్ కొవి2 ను పోలి ఉన్నట్టు పరిశోధనల్లో గుర్తించినట్టు హాంకాంగ్‌కు చెందిన సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ పత్రిక తన కథనంలో పేర్కొంది. వివరాలు 2లో

# జర్నలిస్టులకి ఆరోగ్య జీవిత బీమా: భట్టి విక్రమార్క



తొలి అక్షరం/హైదరాబాద్,ఫిబ్రవరి21:జర్నలిస్టులకి హెల్త్ ఇన్సూరెన్సు కల్పించడంతో పాటు జీవిత బీమా కల్పించేదానిపై ప్రభుత్వంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం బడ్జెట్ లో తగిన నిధులు కేటాయిస్తామన్నారు. ఇళ్ల స్థలాల సమస్యను ఏం చేయాలనే దానిపై ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో హైదరాబాద్ యూనియన్ అఫ్ జర్నలిస్ట్స్ (హెచ్ యూజే- టీడబ్ల్యూజేఎఫ్ ) 2025 డైరీని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హెచ్ యూజే అధ్యక్ష, కార్యదర్శులు అరుణ్ కుమార్, జగదీష్ జర్నలిస్టుల సమస్యలను డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా జర్నలిస్టుల హెల్త్ కార్డులు పనిచేయడం లేదని చెప్పారు. జర్నలిస్టుల కుటుంబాలకి ప్రతి ఏడాది రూ.10 లక్షల వరకు హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు.ప్రభుత్వ ఉద్యోగుల హెల్త్ స్కీం లో జర్నలిస్టుల హెల్త్ స్కీం కలిపి అన్ని ప్రైవేటు , కార్పొరేట్ ఆసుపత్రుల్లో జర్నలిస్టులకు ఉచిత వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైతుల కోసం రైతు బీమా అమలు చేస్తున్నారని, వివరాలు 2లో



# ఎల్ఆర్ఎస్ పేరుతో రూ.50 వేల కోట్ల దోపిడీ: బండి సంజయ్

తొలి అక్షరం/హైదరాబాద్,ఫిబ్రవరి21:తెలంగాణ జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రజలు బిజెపి వైపే ఉన్నారని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. మొదటి ప్రాధాన్యతా ఓటుతోనే మూడు ఎంఎల్ సి సీట్లు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు.అన్ని వర్గాలను కాంగ్రెస్ మోసం చేసిందని దుయ్యబట్టారు. పెద్దపల్లిలో బండి వివరాలు 2లో

# మరాఠీ సాహిత్య సమ్మేళనంలో ఆసక్తికర ఘటన

(మొదటి పేజీ తరువాయి)

కొన్ని నెలల క్రితం కేంద్రం శాస్త్రీయ భాష హోదా కల్పించింది. ఈ నేపథ్యంలో దాదాపు 71 ఏళ్ల తర్వాత దిల్లీ వేదికగా రెండోసారి ఈ సదస్సు నిర్వహిస్తున్నారు. తొలిసారి జవహర్‌లాల్ నెహ్రూ దిల్లీలో మరాఠా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా శరద్ పవార్.. మోదీని ప్రశంసించారు. కార్యక్రమానికి ఆహ్వానించినప్పుడు వెంటనే కాదనకుండా అంగీకరించారని తెలిపారు. మరాఠీకి ఉన్నత భాష హోదా ఇవ్వడంలో ప్రధాని మోదీ పాత్ర కీలకం అంటూ కొనియాడారు. తన ప్రసంగం ముగించుకుని వచ్చి కుర్చీలో కూర్చొనే క్రమంలో ఈ అరుదైన సన్నివేశం చోటుచేసుకుంది.

# భూపాలపల్లి కోర్టు ఉత్తర్వులను కొట్టివేయాలి

(మొదటి పేజీ తరువాయి)

ఫిర్యాదు చేసిన వ్యక్తి మృతిచెందితే ఈ పిటిషన్‌పై ఎలా విచారణ చేపడతామని ప్రశ్నించారు. ఫిర్యాదుదారు మృతి చెందినా విచారణ కొనసాగించాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోరారు. ఈ మేరకు సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పులు ఉన్నాయన్నారు. వాదనలు వినిపించేందుకు గడువు ఇవ్వాలని కోరారు. తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేశారు.


# కృష్ణా యాజమాన్య బోర్డు భేటీ వాయిదా

(మొదటి పేజీ తరువాయి)

ఈ నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం 3.30 గంటలకు సమావేశం జరుగనుంది. ఈ మేరకు రెండు రాష్ట్రాలకు సమాచారం అందించామని అధికారులు వెల్లడించారు. కాగా, శ్రీశైలం, నాగార్జున సాగర్ నుంచి కృష్ణా నీటిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అక్రమంగా తరలిస్తున్నదని, వెంటనే అడ్డుకోవాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేఆర్ఎంబీకి ఫిర్యాదు చేశారు. రెండు ప్రాజెక్టుల పరిధిలో 35 చోట్ల టెలిమెట్రీ పరికరాలు ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో బోర్డు చైర్మన్ అతుల్ జైన్ అధ్యక్షతన శుక్రవారం మధ్యాహ్నం సమావేశం ఏర్పాటు చేసింది. అయితే ఏపీ విజ్ఞప్తితో సమావేశం వాయిదాపడింది. అయితే కృష్ణా, గోదావరి జలాలను ఏపీ తరలించుకుపోతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్ర వీడటం లేదంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించిన విషయం తెలిసిందే. 666 టీఎంసీలకు గాను ఏపీ ఇప్పటికే 657 టీఎంసీలను వినియోగించుకున్నదని, తెలంగాణకు 343 టీఎంసీలకు గాను 220 టీఎంసీలు మాత్రమే వినియోగించుకోవడం ప్రభుత్వ అసమర్థతేనని మండిపడ్డారు. ఇప్పటికైనా సర్కారు కండ్లు తెరిచి రైతుల పంటలు కాపాడలంటే తక్షణమే కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు నీటి విడుదలను వెంటనే బంద్ చేయించాలని డిమాండ్ చేశారు.

# కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన మాజీ ఎంఎల్ఎ కోనేరు కోనప్ప

**తొలి అక్షరం/హైదరాబాద్,ఫిబ్రవరి21:** సిర్పూర్ కాగజ్‌నగర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. ఇకపై ఏ పార్టీలో చేరకుండా స్వతంత్రంగా ఉంటానని ఆయన తెలిపారు. గతంలో బిఆర్ఎస్ నేత అర్ఎస్ ప్రవీణ్ కుమార్ చేసిన వ్యాఖ్యల వల్లే తాను బిఆర్ఎస్ పార్టీని వీడినట్లు ఆయన తెలిపారు. బిఆర్ఎస్ పార్టీని, కెసిఆర్‌ను తాను ఎప్పుడూ విమర్శించలేదని ఆయన స్పష్టం చేశారు. తాజాగా జరుగుతున్న గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో బిఎస్పీ అభ్యర్థికి మద్దతు ప్రకటిస్తున్నట్లుగా ఆయన తెలిపారు. గతేడాది మార్చి 6వ తేదీన కోనేరు కోనప్ప సిఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. అంతకుముందు కోనప్ప 2014 ఎన్నికల్లో బిఎస్పీనుంచి పోటీ చేసి నాటి బిఆర్ఎస్ అభ్యర్థి కావేటి సమ్మయ్యపై విజయం సాధించారు. ఎన్నికల తర్వాత అధికార బిఆర్ఎస్ పార్టీలో చేరారు. అనంతరం 2018లో బిఆర్ఎస్ నుంచి పోటీ చేసి మరోసారి ఎమ్మెల్యేగా గెలిచారు. 2023లో జరిగిన ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి పాల్వాయి హరీశ్ చేతిలో ఓటమిపాలయ్యారు. ఆ ఎన్నికల్లో తనపై బిఎస్పీ అభ్యర్థిగా పోటీ చేసిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను బిఆర్ఎస్‌లో చేర్చుకోవడంతో అసంతృప్తికి గురైన కోనప్ప సిఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఏడాది గడవకుండానే కోనప్ప కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. ఇటీవల సిర్పూర్ కాగజ్ నగర్ నియోజకవర్గం కాంగ్రెస్‌లో నెలకొన్న విభేదాలు రచ్చకెక్కాయి.



# కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

చేయడమే తమ లక్ష్యమన్నారు సీఎం రేవంత్ రెడ్డి. నారాయణపేటలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలోని పెట్రోల్ బంక్ ను రేవంత్ ప్రారంభించారు. మహిళలో ముఖాముఖీ మాట్లాడిన రేవంత్.. కోటి మంది మహిళలను మహిళా సంఘాల్లో చేర్చుతామని చెప్పారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నదే ప్రభుత్వ ఆలోచనగా చెప్పారు. ఇందిరా మహిళా శక్తిలో 67 లక్షల మంది ఉన్నారు. మహిళా సంఘాలను బలోపేతం చేస్తాం. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం. 1000 మెగావాట్ల సోలార్ పవర్ ను మహిళా సంఘాలకు అప్పగించాం. మహిళా సంఘాల ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పిస్తాం. శిల్పారామం పక్కనే పెద్ద వ్యాపార కేంద్రాన్ని ఏర్పాటు చేశాం. మహిళా సంఘాలు ఆర్థికంగా మరింత ఎదగాలి. గత ప్రభుత్వం మహిళా సంఘాలను




పట్టించుకోలే. 1000 కోట్లతో మహిళా సమాఖ్య సభ్యులకు చీరలు ఇస్తాం. మహిళలు ఆత్మగౌరవంతో బతకాలనే ఏడాదిలో రెండు చీరలు ఇవ్వాలని నిర్ణయించాం. గత ప్రభుత్వం మామూలు చీరలు ఇచ్చేది..మేం నాణ్యమైన చీరలు ఇస్తాం అని రేవంత్ అన్నారు. రాష్ట్ర,కేంద్రం ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో ఉండాలి. ఎన్నికలప్పుడే రాజకీయాలు..మిగతా టైంలో అభివృద్ధి కోసం కలిసి పనిచేయాలి. నియోజకవర్గానికి ఒక్కటైన మహిళా సమాఖ్యకు పెట్రోల్ బంక్ ఇస్తాం. కోటి మంది మహిళలతో ఓఆర్ఆర్ దగ్గర భారీ ప్రదర్శన చేద్దాం రండి, మోడీని పిలుద్దాం, ఇందుకు ఎంపీ అరుణమ్మ సహకరించాలని రేవంత్ పిలుపునిచ్చారు. ఇంకా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు.600 ఆర్టీసీ బస్సులకూ యజమానులను చేశాం. ఇందిరా మహిళా శక్తిలో 67 లక్షల మంది ఉన్నారు. 1000 మెగావాట్ల సోలార్ పవర్ ను మహిళా సంఘాలకు అప్పగించాం. గత ప్రభుత్వం మహిళా సంఘాలను పట్టించుకోలేదు. రూరల్, అర్బన్ అనే తేడా లేదు తెలంగాణలో మహిళలంతా ఒక్కటే. అవసరమైతే కేంద్రం నుంచి నిధులు తెచ్చుకుందాం. ఎంపీ డీకే అరుణ కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చేందుకు సహకరించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి మహిళల అభివృద్ధికి ఎలాంటి సహకారం కావాలన్నా అందించడానికి సిద్ధంగా ఉన్నాం. పాఠశాలలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. నిధులు మేం ఇస్తాం..నిర్వహణ మీరు చేయండి. గుడిని ఎంత పవిత్రంగా నిర్వహించుకుంటామో బడిని కూడా అలాగే నిర్వహించుకోవాలి అని రేవంత్ సూచించారు.

# ఒక్కరోజు కూడా కాలేదు...అప్పుడే విమర్శలా..?

- మాజీ సిఎం అతిశీ వ్యాఖ్యలపై సిఎం రేఖాగుప్తా మండిపాటు




**తొలి అక్షరం/న్యూఢిల్లీ,ఫిబ్రవరి21:** భాజపా ఎన్నికల వాగ్దానాలను నెరవేర్చలేదంటూ దిల్లీ మాజీ సీఎం ఆతిశీ చేసిన విమర్శలను కొత్త సీఎం రేఖా గుప్తా తిప్పికొట్టారు. ఒక్కరోజుకే విమర్శలు చేయడం దారుణమని అన్నారు. కాంగ్రెస్ 15 ఏళ్లు, ఆప్ 13 ఏళ్లు దిల్లీని పాలించాయి. ఇన్నేళ్లపాటు మీరేం చేశారో చూసుకోకుండా.. అధికారంలోకి వచ్చి ఒక్కరోజు కూడా కానీ మాపై విమర్శలు చేస్తారా.. మొదటిరోజే మేం క్యాబినెట్ సమావేశం జరిపాం. బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఆయుష్మాన్ భారత్ యోజనను అందుబాటులోకి తీసుకువచ్చాం. దాంతో ప్రజలకు రూ.10లక్షల మేర వైద్యసహాయం అందనుంది.ఈ పథకాన్ని ఆప్ అమలు చేయలేదు. మమ్మల్ని ప్రశ్నించే హక్కు వారికి లేదు. ప్రధాని మోదీ నాయకత్వంలో దిల్లీ తన హక్కులన్నీ పొందుతుంది. ముందు మీరు మీ పార్టీ గురించి చూసుకోండి. ఎంతోమంది మీ పార్టీని వీడాలని చూస్తున్నారు. కాగ్ రిపోర్ట్‌ను అసెంబ్లీలో పెడితే అందరి జాతకాలు బయటపడతాయని ఆందోళన చెందుతున్నారని రేఖ దుయ్యబట్టారు. దిల్లీలో మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థికసాయం అందించే పథకాన్ని మొదటి క్యాబినెట్ సమావేశంలో ఆమోదిస్తామని భాజపా హామీ ఇచ్చిందని, కానీ మొదటిరోజే దానిని ఉల్లంఘించిందని ఆతిశీ విమర్శించారు. దీనిపైనే సీఎం స్పందన వచ్చింది. నిన్న రామ్‌లీలా మైదానంలో భారీ భద్రతా ఏర్పాట్ల మధ్య వైభవంగా నిర్వహించిన కార్యక్రమంలో దిల్లీ 9వ ముఖ్యమంత్రిగా రేఖాగుప్తా ప్రమాణం చేసిన సంగతి తెలిసిందే. ప్రమాణ కార్యక్రమం ముగిసిన వెంటనే ఆమె సచివాలయానికి వెళ్లి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. అంతర్జాతీయ మహిళా దినోత్సవం మార్చి 8 నాటికి అర్హులైన మహిళల బ్యాంకు ఖాతాల్లో నెలవారీ ఆర్థిక సహాయం రూ.2,500 జమ చేస్తామని తెలిపారు. దిల్లీ అభివృద్ధి కోసం ఒక్కరోజు కూడా వృథా చేయకుండా శ్రమిస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న 14 కాగ్ రిపోర్టులను అసెంబ్లీ తొలి సమావేశాల్లోనే సభలో ప్రవేశపెడతామని చెప్పారు. ఆమె అధ్యక్షతన దిల్లీ సచివాలయంలో గురువారం రాత్రి 7 గంటల సమయంలో తొలి మంత్రివర్గ భేటీ జరిగింది. అనంతరం మంత్రులందరితో కలిసి యమునా ఘాట్ వద్దకు వెళ్లి హారతి నిర్వహించారు.

# చైనాలో కొవిడ్ మాదిరి కొత్త వైరస్ గుర్తింపు !

(మొదటి పేజీ తరువాయి)

గబ్బిలాల్లో కరోనా వైరస్‌లపై విస్తృత పరిశోధనలు చేసి 'బ్యాట్ ఉమెన్ 'గా పేరొందిన ప్రఖ్యాత వైరాలజిస్టు షీ ఝెంగ్‌లీ ఈ పరిశోధన బృందానికి సారథ్యం వహించారు. ఇందులో గాంఘ్జౌ లేబొరేటరీ , గాంఘ్జౌ అకాడమీ ఆఫ్ సైన్సెస్, వుహాన్ విశ్వవిద్యాలయంతోపాటువుహాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి చెందిన శాస్త్రవేత్తలు భాగస్వాములుగా ఉన్నారు. ఈ పరిశోధనకు సంబంధించిన పరిశోధన పత్రం సెల్ జర్నల్‌లో సమీక్షకు ఉంచినట్టు కథనంలో పేర్కొన్నారు. ఈ వైరస్ మెర్బెకోవైరస్‌తోపాటు ప్రాణాంతక మెర్స్‌కోవ్ (మిడిల్ ఈస్ట్ రెస్పిరేటరీ సిండ్రోమ్) ఉప రకానికి చెందినదిగా గుర్తించారు. ఇది హెచ్‌కేయూ5 కరోనా వైరస్ సంతతికి చెందినదిగా పేర్కొన్నారు. ఈ వైరస్‌ను తొలుత హాంకాంగ్ లోని జపనీస్ పిపిస్ట్రెల్ రకం గబ్బిలాల్లో గుర్తించారు. తాజా పరిశోధన ప్రకారం హెచ్‌కెయు 5 కొవి2 నేరుగా లేదా మాధ్యమ జీవుల ద్వారా మనుషులకు వ్యాపించే అవకాశం ఎక్కువగా ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఈ వైరస్ సామర్థం కొవిడ్ 19తో పోలిస్తే తక్కువేనని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.

# రుణమాఫీపై అందమైన కట్టుకథలు

- గాంధీభవన్ దాకా వచ్చిన వారు మీ ఇంటికీ వస్తారు
- ఆరు గ్యారెంటీలపై ఇంకా నిలదీస్తారు
- మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు



**తొలి అక్షరం/హైదరాబాద్,ఫిబ్రవరి21:** అందరికీ రుణమాఫీ చేసినట్లు అందమైన కట్టుకథను ప్రచారం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రజలు నిలదీస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. ఇప్పటికీ చాలా మంది రైతులకు రుణమాఫీ కాలేదని, రైతుల నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయని హరీశ్‌రావు తెలిపారు. గాంధీ భవన్ వద్ద ధర్నాకు దిగిన రైతు విషయంలో హరీశ్‌రావు స్పందించారు. అందరికీ రుణమాఫీ చేసినట్లు అందమైన కట్టుకథను ప్రచారం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారూ.. మిమ్మల్ని నిలదీసేందుకు తుంగతుర్తి నుంచి గాంధీ భవన్ దాకా వచ్చిన రైతు తోట యాదగిరి గారికి ఏం సమాధానం చెబుతారని నిలదీశారు. మీరిచ్చిన ఆరు గ్యారెంటీలు ఎన్నికల గారడీనేనని, 420 హామీల అమలు వట్టి బూటకమేనని తెలంగాణ ప్రజలు తక్కువ సమయంలోనే తెలుసుకున్నరు. మిమ్మల్ని నిలదీసేందుకు ఒక్కొక్కరిగా గాంధీ భవన్‌కు చేరకముందే పాపపరిహారం చేసుకోండి. రైతులు, మహిళలకు, విద్యార్థులకు, వృద్ధులకు, ఉద్యోగులకు.. అన్ని వర్గాలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోండి అని రేవంత్ రెడ్డికి హరీశ్‌రావు సూచించారు. ఈరోజు గాంధీ భవన్ దాకా వచ్చిన వారు, రేపో మాపో మీ జూబ్లీహిల్స్ ప్యాలెస్ దాక వస్తరు. ప్యాలెస్ పాలన వదిలి ప్రజా పాలన కొనసాగించు. ఏడు పదుల వయస్సులో రుణమాఫీ కోసం బ్యాంకుల చుట్టూ తిరిగిండు, అధికారులను వేడుకున్నడు. అయినా వెనకడుగు వేయకుండా గాంధీ భవన్ దాకా వచ్చి పోరాటం చేస్తున్న రైతు యాదగిరి పట్టుదలకు అభినందనలు. ఇదే స్ఫూర్తితో అన్ని వర్గాల ప్రజలు మోసపూరిత కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేయాలని, హామీలు అమలు చేసే దాకా కొట్లాడాలని బీఆర్ఎస్ పక్షాన పిలుపునిస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# జర్నలిస్టులకి ఆరోగ్య జీవిత బీమా: భట్టి విక్రమార్క

(మొదటి పేజీ తరువాయి)

అక్రిడేటెడ్ జర్నలిస్టులందరికీ జర్నలిస్టు బీమా కింద జీవిత బీమా అమలు చేయాలని కోరారు. ఏదేని కారణంతో జర్నలిస్టు చనిపోతే వారి కుటుంబాలకు పరిహారం కింద రూ.5 లక్షల నుండి రూ.10 లక్షలు అందేలా ప్రభుత్వం జర్నలిస్టు బీమా పథకం తీసుకురావాలని కోరారు. సానుకూలంగా స్పదించిన డిప్యూటీ సీఎం జర్నలిస్టుల ఆరోగ్య బీమా, జీవిత బీమా, హెల్త్ కార్డులపై తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనారోగ్యంతో చికిత్స తీసుకుని ఇంటి దగ్గర రెండు మూడు నెలలు విశ్రాంతిలో ఉండే జర్నలిస్టులకూ కుటుంబ పోషణ కోసం ఆర్థిక సహకారం అందించే విషయమై పరిశీలన చేస్తామన్నారు.ఇళ్ల సమస్య కోర్టు పరిధిలో ఉన్నందున ఎలా ముందుకు వెళ్లాలనే దానిపై ఆలోచన చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌యూజే వర్కింగ్ ప్రెసిడెంట్ గండ్ర నవీన్, ట్రెజరర్ బట్టిపాటి రాజశేఖర్, నాయకులు రామకృష్ణ, చిట్యాల మధుకర్, క్రాంతి, ప్రశాంత్ , కొడవటి నవీన్, సీనియర్ జర్నలిస్టులు యాదగిరి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ఆర్ఎస్ పేరుతో రూ.50 వేల కోట్ల దోపిడీ: బండి సంజయ్

(మొదటి పేజీ తరువాయి)

మీడియాతో మాట్లాడారు. కులగణన విషయంలో కొరివితో కాంగ్రెస్ తలగోక్కుంటుందని ఎద్దేవా చేశారు. బిసిల్లో ముస్లింలను ఎందుకు కలిపారని బండి ప్రశ్నించారు. ముస్లింలను తీసి బిసిలకు 42% రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముస్లింలను తొలగిస్తేనే బిసి రిజర్వేషన్లను కేంద్ర ప్రభుత్వం ఆమోదిస్తుందని స్పష్టం చేశారు.ఎల్ఆర్ఎస్ పేరుతో ప్రభుత్వం కొత్త దుకాణం పెట్టిందని దుయ్యబట్టారు. ఎల్ఆర్ఎస్ పేరుతో రూ.50 వేల కోట్ల దోపిడీకి రేవంత్ ప్రభుత్వం ప్లాన్ చేసిందని ధ్వజమెత్తారు. టీచర్ల కోసం లాఠీ దెబ్బలు తగులుతున్నా తగ్గకుండా ఛాతీ ఎత్తి పోరాడామన్నారు. ఆంక్షలు, అడ్డంకులు సృష్టించినా అడుగేసి గురువుల కోసం గొంతెత్తామన్నారు. చావుకు ఎదురొడ్డి కొట్లాడి చదువులు చెప్పే ఉపాధ్యాయులకు అండగా నిలిచామని, అధికారం లేకుండానే టీచర్ల కోసం నిలబడ్డ తెగువ మాదని బండి సంజయ్ పేర్కొన్నారు. ఈ సారి ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులకు ఒక్క అవకాశం ఇవ్వాలన్నారు. శాసన మండలిలో బిజెపి అభ్యర్థులు మీ గొంతుకై నినదిస్తారని, మీ గోసలపై నిలదీస్తారని, సమస్యలని ప్రస్తావిస్తారని, పరిష్కార మార్గం పటిస్తారని అని అన్నారు.

# తాజ్ బంజారాకు జిహెచ్ఎంసి షాక్

- పన్ను కట్టనందకు హోటల్ సీజ్

**తొలి అక్షరం/హైదరాబాద్,21:** హైదరాబాద్ సిటీలో ఫేమస్ అయిన తాజ్ బంజారా హోటల్‌కు జీహెచ్ఎంసీ అధికారుల షాక్ ఇచ్చారు. హైదరాబాద్ బంజారాహిల్స్ తాజ్ బంజారా హోటల్‌ను జీహెచ్ఎంసీ అధికారులు సీజ్ చేశారు. గత రెండేళ్లుగా పన్ను చెల్లించకపోవడంతో ఈ మేరకు అధికారులు సీజ్ చేశారు. పన్ను చెల్లించాలని పలు మార్లు నోటీసులు ఇచ్చినా హోటల్ యాజమాన్యం స్పందించలేదు. దీంతో అధికారులు హోటల్‌ను సీజ్ చేశారు. మొత్తం రూ. కోటి 47 లక్షల టాక్స్ పెండింగ్ ఉందని, పన్ను చెల్లించాలని.. జీహెచ్ఎంసీ అధికారులు 5 సార్లు నోటీసులు ఇచ్చిన హోటల్ యాజమాన్యం స్పందించక పోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. గడిచిన రెండు సంవత్సరాలుగా హోటల్ నిర్వాహకులు జీహెచ్ఎంసీకి పన్ను బకాయలు చెల్లించలేదు. దీనిపై పలుమార్లు నోటీసులు ఇచ్చారు. అయినా హోటల్ నిర్వాహకుల నుంచి ఎలాంటి స్పందన రాలేదు. పరిస్థితి గమనించిన జీహెచ్ఎంసీ అధికారులు శుక్రవారం ఉదయం హోటల్‌ను సీజ్ చేశారు. హైదరాబాద్ సిటీలో ఫేమస్ అయిన.. నిత్యం బిజీగా ఉండే తాజ్ బంజారా హోటల్‌కు సెలబ్రెటీలు ఎక్కువగా వస్తుంటారు. క్రికెటర్లు ఎప్పుడు వచ్చినా ఈ హోటల్‌లో బస చేస్తుంటారు. అలాగే దేశంలోని కీలక రాజకీయనేతలు హైదరాబాద్ వచ్చినప్పుడు ఇక్కడే స్టే చేస్తారు. అనుకూలంగా ఉండడం తో ఎక్కువ మంది ఈ హోటల్ వైపు మొగ్గుచూపుతారు. అటాంటి హోటల్ సీజ్ కావడం గమనార్హం.

# పోటీ నుంచి తప్పకున్న బిఆర్ఎస్

- జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ ఏకగ్రీవం

**తొలి అక్షరం/హైదరాబాద్,ఫిబ్రవరి21:** జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవమైంది. ఇద్దరు బీఆర్ఎస్ కార్పొరేటర్లు నామినేషన్‌ను ఉపసంహరించుకోవడంతో స్టాండింగ్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. బలం లేకపోవడంతో స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు దూరంగా ఉన్నాయి. జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీలో 15 మంది సభ్యులకు గాను 17 నామినేషన్లు దాఖలయ్యాయి. ఎఐఎంఐ నుంచి 8 మంది, కాంగ్రెస్ నుంచి ఏడుగురు, బీఆర్ఎస్‌కు చెందిన ఇద్దరు కార్పొరేటర్లు నామినేషన్లు దాఖలు చేశారు. అయితే ఇద్దరు బీఆర్ఎస్ కార్పొరేటర్లు తమ నామినేషన్‌ను విత్‌డ్రా చేసుకున్నారు. దీంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. 15 మంది స్టాండింగ్ కమిటీలో ఎంఐఎం నుంచి 8, కాంగ్రెస్ నుంచి 7 సభ్యులు ఉండనున్నారు.గతంలో బీఆర్ఎస్ నుంచి ఇద్దరు కార్పొరేటర్లు నామినేషన్ వేయగా....అధిష్టానం ఆదేశంతో నామినేషన్లు విత్ డ్రా చేసుకున్నారు. గత పదేళ్లుగా స్టాండింగ్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం అవుతూ వస్తున్నాయి. అలాగే గత పదేళ్లలో తొలిసారి కాంగ్రెస్ కార్పొరేటర్లు స్టాండింగ్ కమిటీలో చోటు దక్కించు కున్నారు. ఃూగా.. జీహెచ్ఎంసీలో మొత్తం 150 మంది కార్పొరేటర్లు ఉంటే అందులో 15 మంది స్టాండింగ్ కమిటీ సభ్యులను ప్రతీ ఏడాది ఎన్నుకోవడం జరుగుతుంది. జీహెచ్ఎంసీలో పాలనాపరంగా, కొత్త ప్రాజెక్టులకు సంబంధించి ఎలాంటి నిర్ణయం తీసుకోవాలని అనుకున్నా మేయర్, డిప్యూటీ మేయర్ అనంతరం ఈ 15 మంది స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎంతో కీలకం. గడిచిన పదేళ్ల వ్యవధిలో ఇప్పటి వరకు జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికలు జరగలేదు. ప్రతీసారి కూడా ఎన్నికలు ఏకగ్రీవంగా జరుగుతూనే ఉంది. ఈ సారి కూడా సంఖ్యాబలం లేకపోవడంతో బీఆర్ఎస్ కార్పొరేటర్లు తప్పుకోవడంతో స్టాండింగ్




## నల్ల బెల్లం, పట్టిక పట్టివేత, కారు సీజ్: ఎస్సై చిర్ర రమేష్ బాబు..

**తొలి అక్షరం/నెల్లికుదురు, ఫిబ్రవరి 21:** నిషేధిత నల్ల బెల్లం పట్టిక ను తరలిస్తున్న కారును స్వాధీనం చేసుకున్న సంఘటన శుక్రవారం చోటు చేసుకున్నది. స్థానిక ఎస్సై చిర్ర రమేష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రావిరాల స్టేజి వద్ద శుక్రవారం ఉదయంనమ్మదగిన సమాచారం మేరకు తొర్రూర్ నుండి నెల్లికుదుర్ నకు నల్ల బెల్లము పటిక తో ఒక కారు వస్తున్నదని సమాచారము రాగ రావిరాల స్టేజి వద్ద ఒక కారును పట్టుకోవడం జరిగిందని, అందులో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా కారులో 10 బస్తాల నల్ల బెల్లము, 02 బస్తాల పటికను గుర్తించడం జరిగిందిని,అట్టి వ్యక్తుల వివరాలు తెలుసుకోగా గుప్పడి తండా రాయపర్తి కి చెందిన గుగ్లోత్ జాను, మల్ల0పల్లి గుర్తుర్ తండా చెందిన గుగ్లోత్ పవన్ లు కలిసి జామతండాకు చెందిన గుగులోత్ నగేష్ ,వస్రం తాండకు చెందిన గుగులోత్ రవి కి నల్లబెల్లము ను కారులో సరఫరా చేస్తున్నట్లు,వాటి విలువ 70 వేలు ఉంటుదని, కారు సీజ్ చేసి కేసునమోదు చేయడం జరిగిందన్నారు. నిషేధిత మారకద్రవ్యాలైన గంజాయి నల్ల బెల్లం పట్టిక అమ్మిన సరఫరా చేసిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్ఐ రమేష్ బాబు హెచ్చరించారు.

## కస్తూరిబా గాంధీ స్కూల్‌ను మధ్యాహ్నం భోజనం తనిఖీ చేసిన తహసిల్దార్ నాగరాజు






**తొలి అక్షరం/నరసింహుల పేట ఫిబ్రవరి 21:** మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి స్థానిక తహసిల్దార్ నాగరాజు అన్నారు శుక్రవారం మండలంలోనికస్తూరిబాగాంధీ స్కూల్ ను.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన పథకం పంపిణీలో ప్రభుత్వ మెనూ పాటించి నాణ్యమైన ఆహారం అందించాలని తాసిల్దార్‌పేర్కొన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేసి, భోజనాన్ని రుచి చూసి నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు వంట వండే పరిసర ప్రాంతాలలో పరిశుభ్రంగా ఉంచుకోవాలని పాత్రలను ప్రతిరోజు శుభ్రపరుచుకుని జాగ్రత్త పరచాలని తెలిపారు. ప్రభుత్వ మెనూ ప్రకారం రుచికరమైన ఆహారాన్ని విద్యార్థిని విద్యార్థులు అందించాలని తెలిపారు. స్పెషల్ ఆఫీసర్ అధికారి తో పాటు తదితరులు పాల్గొన్నారు

## నూతన వధూవరులను ఆశీర్వదించిన పీసీసీ సభ్యులు సొంటి రెడ్డి

**తొలి అక్షరం/నెక్కొండ ఫిబ్రవరి 21:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ నాయకుడు పత్రికా విలేకరి బిర్రు వినయ్- మమత ల వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన పీసీసీ సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి,మండల కాంగ్రెస్అధ్యక్షులు బక్కి అశోక్, నెక్కొండ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పెండ్యాల హరి ప్రసాద్, మండల కాంగ్రెస్ నాయకులు ఈదునూరు సాయి కృష్ణ, కుసుమ చెన్నకేశవులు, బోడ శ్రీకాంత్ నాయక్, ఇటికాల సంజీవయ్య,మడత వెంకన్న, బిర్రు ప్రభాకర్ పాల్గొన్నారు.



# తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశం

- మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్‌తో కలిసి మాట్లాడిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్
- పాలమూరు ప్రజలపై ముఖ్యమంత్రి కక్షగట్టారు... ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి
- ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి షాద్ నగర్ కు రెండుసార్లు వచ్చారు కానీ లక్ష్మీదేవి పల్లి ఊసే లేదు
- శంకుస్థాపన జరిగి ఆరు నెలలు అవుతున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్ వద్ద ఒక రాయి పడ్డ పాపాన పోలేదు
- రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థకు దిక్కేలేదు
- 14 నెలలు గడుస్తున్నా రైతు భరోసాకే దిక్కులేదు... నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లు ఎలా ఇస్తాడు?




**తొలి అక్షరం/షాద్ నగర్, ఫిబ్రవరి21:** ఏ నియోజకవర్గానికి అయినా సరే రాష్ట్ర ముఖ్యమంత్రి ఒక్కసారి వస్తే ఎన్నో వరాల జల్లులు కురిపిస్తాడని ప్రజలందరూ ఆశిస్తారు కానీ మా పాలమూరు జిల్లాపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎందుకు కక్షపెంచుకున్నాడో ఏమో తెలియదు గానీ షాద్ నగర్ నియోజకవర్గానికి రెండు సార్లు వచ్చిన ముఖ్యమంత్రి లక్ష్మీదేవి పల్లి ప్రాజెక్టు ఊసే ఎత్త లేదని, ఆయన స్వయంగా శంకుస్థాపన చేసిన ఇంటిగ్రేటెడ్ స్కూలుకు ఇప్పటివరకు మోక్షం లేదని, ఇంటిగ్రేటెడ్ స్కూలు నిర్మాణానికి ఒక్క రాయి పడ్డ పాపాన పోలేదని అసలు ముఖ్యమంత్రి ఏం ప్రభుత్వాన్ని నడిపిస్తున్నాడో, స్వయాన ముఖ్యమంత్రి శంకుస్థాపన చేసిన ఇంటిగ్రేటెడ్ స్కూలుకు పనులు ఇంకా ప్రారంభమే కాలేదంటే ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థ ఎలా ఉందో ప్రజలే గమనించాలని ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి అన్నారు. తెలంగాణ భవన్ లో జరిగిన ప్రెస్ మీట్ లో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మరియు మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ లతో పాటు పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి 10 శాతం పనులు పూర్తయిన పాలమూరు ప్రజలు సంతోషించే వారిని, ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లను ఇస్తానంటున్న ముఖ్యమంత్రి ఇప్పటికే లక్షన్నర కోట్ల అప్పు చేశామని మీరే అంటున్నారని, సర్పంచులకు కాంట్రాక్టర్లకు ఇదివరకు చేసిన పనులకు బిల్లులు చెల్లించే ఆర్థిక స్తోమత రాష్ట్ర ప్రభుత్వం వద్ద లేదని, 100 నియోజకవర్గాలలో ప్రతి నియోజకవర్గానికి 3500 చొప్పున ఇందిరమ్మ ఇండ్లు ఎలా ఇస్తాడని, 14 నెలలు గడుస్తున్న ఇప్పటికీ రైతు భరోసా డబ్బులు రైతుల అకౌంట్లో జమ కాలేదని, రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థకు అసలు దిక్కేలేదని ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి ప్రభుత్వాన్ని విమర్శించారు. అస్తవ్యస్తమవుతున్న తెలంగాణలో అందరూ ప్రజలు మేల్కొని పునర్ ఆలోచించి తెలంగాణను కాపాడుకోవాలని ఆయన తెలంగాణ ప్రజలను కోరారు.

## దేవాలయాలు హిందూ సంస్కృతి సాంప్రదాయాలకు నిలయాలు

- ధ్వజస్తంభ నాభి శిల ప్రతిష్టాపన కార్యక్రమం
- ప్రతిష్టాపన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భాజపా రాష్ట్ర నాయకుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి





**తొలి అక్షరం/జిల్లేడు చౌదరిగూడ, ఫిబ్రవరి21:** దేవాలయాలు హిందూ సంస్కృతి సాంప్రదాయాలకు నిలయాలని, దేవాలయాల వలన ప్రజలలో భక్తి భావం పెరుగుతుందని, భక్తి భావంతో భగవంతుని ఆరాధిస్తే మనిషి లోపల శక్తి పెరుగుతుందని, ఆ శక్తి ద్వారా అన్యాయాన్ని ఎదిరించి న్యాయం దిశ వైపు పోరాడే ప్రయత్నం జరుగుతుందని, తద్వారా సమాజంలో మంచి అనే భావన అందరిలో కలుగుతుందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. ఈరోజు జిల్లేడు చౌదరిగూడ మండలం గుంజల్ ఫహాడ్ గ్రామంలో నూతన అభయ ఆంజనేయ స్వామి సీతారమచంద్ర స్వామి శివాలయ నవగ్రహ ధ్వజస్తంభము నాభిశిల ప్రతిష్ట కార్యక్రమానికి రాష్ట్ర నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్తులు దేవాలయ కమిటీ ఆయనను సాదరంగా ఆహ్వానించి సన్మానం చేశారు. అనంతరము ఆయన దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి వేద పురోహితుల ఆశీర్వాదాలతో తీర్థప్రసాదాలు సేవించారు. జిల్లేడు చౌదరిగూడ మండల అధ్యక్షులు ఎదిర రాజు, మోహన్ సింగ్ నాయక్, సుధాకరప్ప, ఇస్నాతి శ్రీనివాస్, నరేష్ , భాజపా నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఆర్టిఏ నూతన మెంబర్‌గా ఎన్నికైన మంథని సురేష్‌కు ఘన సన్మానం

- పదవికి వన్నె తేవాలని ఆకాంక్షించిన మంత్రపురి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అజయ్



**తొలి అక్షరం/మంథని:** పెద్దపల్లి జిల్లా ఆర్టిఏ కార్యాలయం నాన్ అఫీషియల్ మెంబర్ మంథని సురేష్ ను శుక్రవారం మంత్రపురి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గడిపల్లి అజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్టిఏ మెంబర్ మంథని సురేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఆశీస్సులతో తాను ఆర్టిఏ మెంబర్ గా నియమితులయ్యానని వారు అన్నారు. తనకు అప్పగించిన బాధ్యతలను అందరి సమన్వయంతో పని చేస్తు ముందుకెళ్తానని అన్నారు. ట్రాఫిక్ రూల్స్ పై జిల్లా వ్యాప్తంగా అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే ఆర్టిఏ కార్యాలయానికి భూమి సేకరణ, భవన నిర్మాణానికి నిధుల మంజూరు గురించి మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. మంత్రపురి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గడిపల్లి అజయ్ కుమార్ మాట్లాడుతూ మంథని పట్టణానికి చెందిన మంథని సురేష్ గత 35 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో నిస్వార్థంగా, అంకిత భావంతో పనిచేయడం వల్లనే మంత్రి శ్రీధర్ బాబు గుర్తించి ఆర్టిఏ మెంబర్ పదవికి ఎంపిక చేశారని అన్నారు. నాయి బ్రాహ్మణ సామాజిక వర్గం నుంచి జిల్లా స్థాయి పదవి చేపట్టడం ఆ సామాజిక వర్గానికి గర్వకారణమని అన్నారు. మిత్రులు మంథని సురేష్ తనకు లభించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తాను చేపట్టిన పదవికి వన్నె తెస్తు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ దార మధు తెలంగాణ తేజ,మంథని లక్ష్మణ్ మంథని ఆర్సి ప్రత్యక్ష సాక్షి, కాసిపేట శ్రీకాంత్ మంథని ఆర్సి నేటి మాట సదానందం తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నిర్వహణకు కావాల్సిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలి: కలెక్టర్

**తొలి అక్షరం/గద్వాల జిల్లా:** గద్వాల జిల్లా లో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అధికారులకు ఆదేశించారు. శుక్రవారం ఐడిఓసి కాన్ఫరెన్స్ హాల్ నందు ఇంటర్ విద్య, పాఠశాల విద్య, రెవెన్యూ, పోలీసు,రవాణా, వైద్య ఆరోగ్యం,విద్యుత్,పోస్టల్ తదితర శాఖల అధికారులతో ఇంటర్ పరీక్షల నిర్వహణపై జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 5 నుండి ప్రారంభమయ్యే ఇంటర్ వార్షిక పరీక్షల నిర్వహణకు కావాల్సిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని పరీక్షా కేంద్రాల్లో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో 14 పరీక్షా కేంద్రాల్లో 8,341 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. వీరిలో ఫస్ట్ ఇయర్ స్టూడెంట్లు 4,057, సెకండ్ ఇయర్ 4,284 మంది ఉన్నారన్నారు.పరీక్షలను నిష్పాక్షికంగా నిర్వహించేందుకు చీఫ్ సూపరిడెంట్స్, ఫ్లయింగ్ స్క్వాడ్లు, సిట్టింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేసి కఠినమైన నిఘా పెట్టాలని తెలిపారు.స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాటు చేసి,ఇందుకోసం కస్టోడియన్ మరియు డిపార్ట్మెంటల్ అధికారులను నియమించాలని ఆదేశించారు.అన్ని పరీక్షా కేంద్రాల్లో ముందుగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశిస్తూ, పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ ఉన్నందున జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లోకి ఎవరు సెల్‌ఫోన్ తీసుకురావడానికి అనుమతి లేదని స్పష్టం చేశారు.విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా అవసరమైన మార్గాల్లో బస్సు సర్వీసులు నడిపేలా ఆర్టీసీ అధికారులను ఆదేశించారు.పరీక్షా కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ కిట్లు,ఓఆర్ఎస్ ప్యాకెట్లు,తగిన మందులతో మెడికల్ ఆఫీసర్,ఆశాలను అందుబాటులో ఉంచాలని వైద్య శాఖ అధికారులను సూచించారు. పరీక్షా సమయంలో ఎటువంటి విద్యుత్ అంతరాయం లేకుండా విద్యుత్ శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు.తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ నర్సింగ రావు,ఆర్డీఓ శ్రీనివాస రావు, డిఎస్పీ మొగలయ్య, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి హృదయ రాజు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిద్దప్ప,విద్యుత్ శాఖ అధికారి రమేష్ బాబు,ఆర్టీసీ అధికారి శ్రీనివాస రెడ్డి, విద్యా శాఖ శ్రీనివాస, పోస్టల్ అధికారి అయూబ్ ఖతీబ్, తదితరులు పాల్గొన్నారూ.

## ఖనిలో 23న ఏఐఎఫ్టియు స్టేట్ కౌన్సిల్ సమావేశం: విమలక్క

**తొలి అక్షరం/గోదావరిఖని: ఫిబ్రవరి 21:** ఏఐఎఫ్టి యు అనుబంధ శ్రామిక శక్తి గోదావరి లోయ బొగ్గగని కార్మిక సంఘం ఆధ్వర్యంలో పోరాటాల చరిత్ర గలిగిన గోదావరిఖని పట్టణంలో ఈనెల 23న రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు అరుణోదయ రాష్ట్ర అధ్యక్షురాలు విమలక్క అన్నారు. ఈ మేరకు శుక్రవారం గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సింగరేణి ప్రాంతంలో అనేక పోరాటాలు చేసిన చరిత్ర కలిగిన ఏఐఎఫ్టియు అనుబంధ శ్రామిక శక్తి గోదావరి లోయ బొగ్గ గాని కార్మిక సంఘానికి ఉందని అన్నారు. కోల్ బెల్ట్ వ్యాప్తంగా కార్మిక వర్గానికి అండగా ఉండేందుకు, సింగరేణిలో కార్మిక వర్గం కోసం పోరాటం చేసిన అనేకమంది ఉద్యమకారులను కోల్పోవాల్సి వచ్చిందన్నారు. ప్రైవేటీకరణ దిశగా కొనసాగుతున్న సింగరేణి కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అందుకు నిర్మాణాత్మకమైన రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశం ఈ ప్రాంతంలో నిర్వహిస్తున్నామని ప్రజలు, కార్మికులు, ప్రజాస్వామిక వాదులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని విమలక్క పిలుపునిచ్చారు. **అడవి బిడ్డలను పొట్టన పెట్టుకుంటున్న కేంద్ర ప్రభుత్వం..** ఆదివాసీలకు అండగా నిలవాలి... నిజమైన దేశభక్తులు విప్లవ ఉద్యమకారులే... అరుణోదయ రాష్ట్ర అధ్యక్షురాలు విమలక్క బహుళ జాతి కంపెనీలకు రెడ్ కార్పెట్ వేస్తూ అడవిని ఆదివాసీలపై కేంద్ర ప్రభుత్వం చేస్తున్న హత్యాకాండ విధానం మార్చుకోవాలని విమలక్క అన్నారు. ఆపరేషన్ ఖగార్ పేరుతో అడవి బిడ్డలను అడవికి ఆదివాసీలకు అండగా నిలుస్తున్న నక్సలైట్లను కేంద్ర ప్రభుత్వ మారణకాండను ప్రజలందరూ ఖండించాలని, అడవిని ఆదివాసీలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. చత్తీస్గఢ్ దండకారణ్యంలో జరుగుతున్న ఆపరేషన్ ఖగార్ తక్షణమే నిలిపివేయాలని ఆదివాసీలను కాపాడుకోవాలని అడవిని ఆదివాసీలకు అండగా నిలువాలన్నారు.ఈ కార్యక్రమంలో మాతంగి రాయమల్లు, మేకల పోచమల్లు, జి రాములు, వెల్తురు సదానందం, టి రత్నకుమార్, పల్లె లింగయ్య, జనగామ చిన్నయ్య, లావణ్య, యాకయ్య, కృష్ణ స్వామి, ఏ ఐ ఎఫ్ టి యు తో పాటు అరుణోదయ నాయకులు పాల్గొన్నారు.



# ప్రజాస్వామ్య వ్యవస్థలో జర్నలిస్టుల పాత్ర కీలకం

**• తొలి అక్షరం నూతన సంవత్సర**

**క్యాలెండర్ ఆవిష్కరించిన ఎస్సై పిల్లల రాజు**



**తొలి అక్షరం/దంతాలపల్లి ఫిబ్రవరి21:** ప్రజాస్వామ్య వ్యవస్థ సమర్థవం తంగా సవ్యంగా కొనసాగాలంటే జర్నలిస్టుల పాత్ర ఎంతో ముఖ్యమైనదని దంతాలపల్లి ఎస్సై పిల్లల రాజు అన్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని రూపొందించిన తొలి అక్షరం తెలుగు దినపత్రిక నూతన సంవత్సరం క్యాలెండర్ ను తొలి అక్షరం రిపోర్టర్ అనపర్తి వీరన్న ఆధ్వర్యంలో శుక్రవారం రోజు దంతాలపల్లి స్థానిక పోలీస్ స్టేషన్ కార్యాలయంలో ఎస్సై పిల్లల రాజు చేతుల మీదుగా ఆవిష్కరణ చేశారు. ఈ సంద్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగో ఫిల్లరుగా పిలువబడుతున్న మీడియా పటిష్ఠంగా ఉంటేనే సమాజంలోని మిగతా వ్యవస్థలు స్ఫృహతో పని చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు,తొలి అక్షరం రిపోర్టర్ అనపర్తి వీరన్న, కానిస్టేబుల్స్ , జెన్నయ్య, గణేష్,బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# పదిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలి..

**• విద్యార్థులు ఇష్టపడి చదవండి:**

**మండల ప్రత్యేక అధికారి జినుగు మరియన్న,తహసిల్దార్ రాజు.**





**తొలి అక్షరం/నెల్లికుదురు, ఫిబ్రవరి 21:** పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేకత నిర్వహించి పదిలో 100% ఉత్తీర్ణత సాధించే విధంగా సకల చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న తాసిల్దార్ కోడి చింతల రాజు సంబంధిత అధికారులను కోరారు. శుక్రవారం మండలంలోనివసతి గృహాల లో మెనూ ప్రకారం తాజా, నాణ్యమైన ఆహారం తో అందించడం తో పాటు, పదవ తరగతి లో 100 % ఉత్తీర్ణత సాధించాలి. జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ఐ ఎ ఎస్,ఆదేశాల మేరకు ప్రకారం, మండల పరిధిలోని అన్ని వసతి గృహాలను తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పలు సూచనలు చేస్తూ విద్యార్థిని, విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని అందించాలని, పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కోరారు. తాజా కూరగాయలు, మంచి ఆహార పదార్థాలు ఇవ్వాలి అని,వసతి గృహాలలో పెరటి తోటల కూరగాయల పెంపకం (కిచెన్ గార్డెనింగ్) చేపట్టాలని కోరారు. ముఖ్యం గా టెన్త్ క్లాస్ విద్యార్థిని,విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి, 100% ఉత్తీర్ణత సాధించే విధంగా సకల చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యార్థులు ఇష్టపడిన చదివితే విజయం మేవెంటే ఉంటుందని, విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత ఆరోగ్య విషయంలో శ్రద్ధ వహించాలని పరీక్షాల సమయంలో ఒత్తిడికి లోను కాకుండా అభ్యసించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి బాలరాజు, సంబంధిత అధికారులు సుమలత, ఉపేందర్, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సుందర్ రాజ్ యాదవ్‌ను సమిష్టిగా గెలిపించుకుందాం

**• బీసీ సంక్షేమ సంఘం నర్సంపేట**

**నియోజకవర్గ ఇంచార్జ్ డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్**

**తొలిఅక్షరం/ఫిబ్రవరి 21 (నర్సంపేట):** నియోజకవర్గంలోని నెక్కొండ మండలంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ ఇంచార్జ్ డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ అభ్యర్థి సుందర్ రాజ్ యాదవ్ సతీమణి ఆశాజ్యోతి నెక్కొండ మండల వ్యాప్తంగా ప్రచారంతో పాటు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆశాజ్యోతి మాట్లాడుతూ ఈ సమాజ నవ నిర్మాణంలో ఉపాద్యాయ వృత్తి ఎంతో కీలకం అయినది. అలాంటి ఉపాద్యాయ వృత్తిలో ఉన్న ప్రైవేటు మరియు ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం కావాలంటే మీ మొదటి ప్రాధాన్యత ఓటు 19వ నెంబర్ లో వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మనస్ఫూర్తిగా కోరుతున్నాను అని అన్నారు. డ్యాగల శ్రీనివాస్ మాట్లాడుతూ...ఉమ్మడి వరంగల్,ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ శాసనమండలి (ఎమ్మెల్సీ) ఎన్నికల్లో బీసీ సంఘాలు, ఉపాధ్యాయులు, ఉద్యమకారులు, సామాజిక సంఘాలు బలపర్చిన అభ్యర్థి ఎస్ సుందర్ రాజ్ యాదవ్ ను గెలిపించుకోవడం కోసం నర్సంపేట నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని డ్యాగల శ్రీనివాస్ కోరడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అభ్యర్థి సుందర్ రాజ్ యాదవ్ సతీమణి ఆశాజ్యోతి, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు బుట్టి శ్యామ్ కుమార్ యాదవ్, నర్సంపేట నియోజకవర్గ ఇంచార్జ్ డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్, నియోజకవర్గ నాయకులు మరుపల వీరస్వామి కురుమ, చెన్నారావుపేట మండల మహిళా అధ్యక్షురాలు బండి విజయ, చెన్నారావుపేట గ్రామ మహిళా అధ్యక్షురాలు ముంజ లక్ష్మి, నర్సంపేట మండల నాయకులు ఎల్లబోయిన కుమారస్వామి, నల్లబెల్లి మండల నాయకులు చల్లా నారాయణ, ప్రమోద్ కుమార్, గంద్రకోట రాకేష్ కుమార్ లతోపాటు ఉపాద్యాయులు పాల్గొన్నారు.



# అమ్మ భాష అమృతం లాంటిది

**• అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవంలో డీఈఓ రాధా కిషన్**



**తొలి అక్షరం/పాపన్నపేట, ఫిబ్రవరి 21:** తల్లి భాష అమృతం లాంటిదని, తల్లి భాషను మరవద్దని జిల్లా విద్యాశాఖ అధికారి రాధా కిషన్ సూచించారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం పురస్కరించుకొని మండల కేంద్రమైన పాపన్న పేటలో నిర్వహించిన అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా పద్య పఠనం పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మాతృభాష తల్లి ద్వారా వస్తుందని, ప్రతి విద్యార్థికి తల్లె మొదటి గురువని , ఆమె ద్వారా వినడం ,మాట్లాడడం నేర్చుకుంటాడని, ఇక గురువుద్వారా చదవడం, రాయడం నేర్చుకుంటాడని ఆయన వివరించారు. అందుకే ప్రతి ఒక్కరు ఎన్ని భాషలు నేర్చిన మాతృభాషకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు, ఇటీవల కాలంలో తల్లిదండ్రులు ఇంగ్లీషు భాష పై మక్కువ పెంచుకోవడం మూలంగా తమ పిల్లలకు ఇంగ్లీషు రావాలని ఆశిస్తూ మాతృ భాషను పక్కకు పెడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇంగ్లీష్ అయినా హిందీ అయినా మాతృభాష తర్వాతే అని ఆయన పేర్కొన్నారు. అనంతరం పాపన్నపేట కాంప్లెక్స్ పరిధిలో నిర్వహించిన పద్య పఠనం, ధారాళంగా చదవడం పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ఆయన చేతుల మీదుగా అందించారు. ధారాళంగా చదవడంలో చీకోడ్ పాఠశాల చెందిన మోక్షిత, నార్సింగి పాఠశాలకు చెందిన పావని ప్రతిభ కనపరచగా, పద్య పఠనం పోటీలలో అరికెలకు చెందిన భావన, రాకేష్ ఉత్తమ ప్రతిభ కనబరిచారు. వీరికి జిల్లా విద్యాశాఖ అధికారి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏ ఎం ఓ సుదర్శన మూర్తి, మండల విద్యాధికారి ప్రతాపరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహేశ్వర్, తెలుగు ఉపాధ్యాయులు అంజా గౌడ్, మంగ నర్సింలు,భట్టు నాగరాజు, తో పాటు ఉపాధ్యాయులు అంజనా చారి, శ్రావణి, అశ్విని, వినీత , బాబు, శరణ్య తోపాటు పాపన్నపేట ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం




**తొలిఅక్షరం/ఫిబ్రవరి 21 (నర్సంపేట):** ప్రభుత్వ డిగ్రీ కళాశాల నర్సంపేట (అటానమస్)లో తెలుగు విభాగం ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ మల్లం నవీన్ అధ్యక్షతన అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రిన్సిపల్ ప్రొఫెసర్ మల్లం నవీన్ మాట్లాడుతూ..మాతృ భాషా విద్యార్థులలో సృజనాత్మక శక్తులను వెలికితీస్తుంది. మాతృ భాషా మీద పట్టు ఉంటె ఇతర భాషలని సులభంగా నేర్చుకోవచ్చుని,తద్వారా ఇతర భాషలను నేర్చుకోవడానికి మాతృభాష ఎంతో సహాయకారిగా ఉంటుంది. అంతేకాక వ్యక్తి సంపూర్ణ వికాసానికి తోడ్పడేది మాతృ భాష ఒక్కటే అని పేర్కొన్నారు. తెలుగు విభాగాధిపతి ఎస్. రజిత మాట్లాడుతూ..గతానికి వర్తమానానికి భవిష్యత్తుకు వారధి మాతృభాష అని అన్నారు. కార్యక్రమంలో ఆంగ్ల విభాగాధిపతి ఎంఎంకే రహీముద్దీన్,హిందీ విభాగాధిపతి డాక్టర్ బి.గాయత్రీ తో పాటు వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బైరి సత్యనారాయణ అకాడమీ కోఆర్డినేటర్ డాక్టర్ కందాల సత్యనారాయణ,స్టాఫ్ సెక్రెటరీ డాక్టర్.సోమయ్య,ఎస్. కమలాకర్, డాక్టర్.ఎం. రాంబాబు,డాక్టర్. డి.సంధ్య,డా.భద్రు, డా.రాజీరు, ఆర్. రుద్రాణి, డా.పూర్ణచందర్, వీరన్న,రమేష్, గ్లోరీ,మాధవి, లక్ష్మి,ఆనందరావు, నిజాం,శ్రీనివాస్,దివ్య ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కొందుర్గు మండలంలో ముగిసిన రాష్ట్ర స్థాయి కబడ్డీ టోర్నమెంట్

**• ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి • గెలిచిన జెట్లకు బహుమతుల అందజేసిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మరియు కొందుర్గు మండల నాయకులు • విన్నర్ టీం: పండుగ సాయన్న టీమ్ • రన్నర్ టీం: జ్యోతి క్లబ్ టీమ్**



**తొలి అక్షరం/కొందుర్గు ,ఫిబ్రవరి21:** హైందవ ధర్మ పరి రక్షణ కోసం ఎన్నో యుద్ధాలు చేసిన మహా వీరుడు శ్రీ ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి ని పురస్కరించుకుని రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలకేంద్రంలో ఛత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో 11వ రాష్ట్ర స్థాయి ఓపెన్ మరియు రూరల్ కబడ్డీ టోర్నమెంట్ లో ఓపెన్ విభాగంలో 30 టీంలు పాల్గొన్నాయి. విన్నర్ టీం గా పండుగ సాయన్న టీమ్, రన్నర్ గా జ్యోతి క్లబ్ టీం లు నిలిచాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి హాజరై గెలుపొందిన జట్లకు స్థానిక మండల నాయకులతో కలిసి బహుమతులు అందజేశారు. హైందవ సామ్రాజ్యాన్ని స్థాపించిన మరాఠా యోధుడు శ్రీ ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఆ మహానియున్ని స్మరించుకుంటు కొందుర్గు మండలకేంద్రంలో పెద్ద ఎత్తున కబడ్డీ టోర్నమెంట్ నిర్వహించిన ఛత్రపతి శివాజీ యూత్ సభ్యులను మరియు స్థానిక మండల నాయకులను అభినందించారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సాహం అందించడానికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని ఆయన అన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని క్రీడాకారులకు సూచించారు. గెలిచిన ఓడిన క్రీడల పట్ల నిరుత్సాహ పడవద్దని అన్నారు. రూరల్ విభాగంలో మొత్తం 30 జట్లు పాల్గొనగా, విన్నర్ గా మరికల్. రన్నర్ గా బాటసింగారం, మూడవ బహుమతి ఆగిర్యాల, నాల్గవ బహుమతి ఉడిత్యాల టీమ్ లు నిలిచాయి. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎం,పి,పి రాజేష్ పటేల్, జడ్పిటిసి తనయుడు ఎదిరా రామకృష్ణ, పిఎసిఎస్ వైస్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి. బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మాదేవ్ పూర్ రవీందర్ రెడ్డి, మాజీ సర్పంచులు ఉమ్మెంత్యాల నర్సిములు, మాదేవ్ పూర్ రాజా రమేశ్వర్ రెడ్డి, రాంచంద్రయ్య, గంగన్నగూడ శేఖర్, తంగలపల్లి బాల్ రాజు, ఆగిరాల భీమయ్య, ఎంపిటిసి గోపాల్, ఉపసర్పంచ్ యాదయ్య గౌడ్, శివాజీ యూత్ అధ్యక్షులు , మొడ్సు యాదగిరి, బోయ శంకర్, ఈసారి సత్యం, చోడపురం శ్రీనివాస్, గండేటి విజయ్, బి ప్రవీణ్, అన్నారం రవిందర్ గౌడ్, కొణింటి సందీప్, ప్రశాంత్, చందు, ముట్ పూర్ వేణు, ఉమెంతలా క్రిష్ణ, శివా, శ్రీరంగాపూర్, రాజు, శేఖర్, నగేష్, యాదయ్య, దయ్యాల శేఖర్, తేజ,క్రీడాకారులు, శివాజీ యూత్ సభ్యులు. గ్రామస్థులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ పార్టీ బ్లాక్ మహిళా విభాగం రెండవసారి అధ్యక్షురాలుగా రామారావు శిరీష

**తొలిఅక్షరం/నెక్కొండ ఫిబ్రవరి 21:** వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గ ఎంఎల్ఏ దొంతి మాధవరెడ్డి నాయకత్వంలో టిపిసిసి సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి సూచన మేరకు కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగంలో పనిచేస్తున్న నెక్కొండకు చెందిన రమారావు శిరిష-రాము ను రెండవ సారి మహిళా కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షురాలిగా నియామక పత్రాన్ని అందించిన మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు శ్రీమతి సునీత రావు, వరంగల్ జిల్లా అధ్యక్షురాలు కర్నాటి పార్వతమ్మ శిరీష మాట్లాడుతూ నాపై నమ్మకంతో మరోసారి అవకాశం కల్పించిన ఎంఎల్ఏ దొంతి మాధవరెడ్డి కి పీసీసీ సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి కి మహిళా కాంగ్రెస్ నాయకులకు మరియు నెక్కొండ మండల కాంగ్రెస్ నాయకులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తానని,క్రమశిక్షణతో పనిచేస్తానని అన్నారు

# నూతన వధూవరులను ఆశీర్వదించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



**తొలిఅక్షరం/నెక్కొండ ఫిబ్రవరి 21:** వరంగల్ జిల్లా గుండ్లపహాడ్ గ్రామ మాజీ సర్పంచ్ కర్నూరి కట్టయ్య కుమారుడు నాగరాజు – హారిక లా వివాహ వేడుకల లో గిర్ని బావి కనిష్క ఫంక్షన్ హాల్ లో జరగగా టిపీసీసీ సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి. పెండెం రామానంద్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తోకల శ్రీనివాస్ రెడ్డి, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు ఓర్స్ తిరుపతి వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో నెక్కొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బక్కి అశోక్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పెండ్యాల హరిప్రసాద్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కూసుమ చెన్నకేశవులు ఈదునూరు సాయికృష్ణ వరంగల్ జిల్లా ఎన్ ఎస్ యు ఐ ప్రెసిడెంట్ బోడ శ్రీకాంత్ నాయక్ మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సీఐ హతిరామ్ నాయక్ వారిచే నాటిన మొక్కకు సంరక్షణ

**- వన ప్రేమికుడు నల్లగొండ సమ్మయ్య**

**తొలిఅక్షరం/నెక్కొండ ఫిబ్రవరి 21:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం పురస్కరించుకొని గ్రీన్ ఇండియా ఛాలెంజ్ అవార్డు గ్రహీత వన ప్రేమికుడు నల్లగొండ సమ్మయ్య నెక్కొండ పోలీస్ స్టేషన్లో సీఐ హతి రామ్ నాయక్ వారిచే నాడు నాటిన వాటర్ ఆపిల్ మొక్కకు సంరక్షణ చేసి నీళ్ళు పోయడం జరిగింది. ఈ సందర్భంగా వన ప్రేమికుడు సమ్మయ్య మాట్లాడుతూ అడుగుతే అన్నం పెట్టేది కన్నతల్లి, అన్నీ తానై అండగా ఉండేది చెట్టు తల్లి. ఈ మొక్క ఫల వృక్షం కావాలని భవిష్యత్తు తరాలకు ఉపయోగపడాలని, భగవంతుని వేడుకున్నారు. భాష ఏదైనా భావం ఒక్కటే మన మాతృభాషను గౌరవిద్దాం అని వన ప్రేమికుడు సమ్మయ్య తెలుగు వారందరికీ అంతర్జాతీయ మాతృభాష దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.



# గుజరాత్, కేరళ సెమీఫైనల్‌లో వివాదాస్పద అవుట్



కేరళ క్రికెట్ జట్టు 2024-25 రంజీ ట్రోఫీ ఫైనల్లోకి ప్రవేశించడం ద్వారా కొత్త చరిత్ర సృష్టించింది. కేరళ రంజీ ఫైనల్‌లోకి ప్రవేశించడం చరిత్రలో ఇదే తొలిసారి. ఫిబ్రవరి 26 నుంచి ప్రారంభమయ్యే ఫైనల్ మ్యాచ్‌లో విదర్భతో తలపడనుంది ఆ జట్టు. సెమీ-ఫైనల్స్‌లో కేరళ గుజరాత్‌తో హోరాహోరీగా తలపడి డ్రా చేసుకుంది. కానీ మొదటి ఇన్నింగ్స్‌లో ఆధిక్యం ఉన్నందున కేరళను ఫైనల్‌కు పంపించారు. గుజరాత్ చివరి వికెట్ విషయంలో భారీ వివాదం చెలరేగింది. దీంతో ఈ మ్యాచ్ హాట్ టాపిక్ అయింది. సెమీఫైనల్ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన కేరళ 457 పరుగులు చేసింది. కేరళ తరఫున మహ్మద్ అజారుద్దీన్ 177 పరుగులతో అజేయంగా నిలిచాడు. 458 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ 9 వికెట్ల నష్టానికి 455 పరుగులు చేసింది. అప్పుడు మూడు పరుగులు చేస్తే గుజరాత్ గెలుస్తుంది ఒక వికెట్ తీస్తే కేరళ విజయం సాధిస్తుంది. ఇక్కడ రంజీ ట్రోఫీలో మ్యాచ్ డ్రా అయితే, మొదటి ఇన్నింగ్స్‌లో ఆధిక్యం సాధించిన జట్టు గెలుస్తుంది. గుజరాత్ కేరళపై కనీసం ఒక పరుగు ఆధిక్యం పొందేలా చూసుకోవాలి. కానీ గుజరాత్ స్కోరు 455/9గా ఉన్నప్పుడు నాగవాస్వాలా క్రీజులో బ్యాటింగ్ చేస్తున్నాడు. అతను షాట్ కొట్టాడు. బంతి 'సిల్లీ మిడ్-ఆన్'లో ఉన్న ఫీల్డర్ హెల్మెట్‌ను తాకి పైకి లేచింది. గాల్లో ఉన్న బంతిని మరోవైపు ఉన్న సచిన్ బేబీ క్యాచ్ పట్టాడు. బంతి గాల్లో ల్యాండ్ కాలేదు కాబట్టి కేరళ ఆటగాళ్లు క్యాచ్ అవుట్ కోసం గట్టిగా అప్పీల్ చేశారు. నాగ్‌వాస్వాలా అవుట్ అయినట్టు అంపైర్ కూడా ప్రకటించేశాడు. దీంతో గుజరాత్ 455 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయింది. దీంతో కేరళకు తొలి ఇన్నింగ్స్‌లో 2 పరుగుల ఆధిక్యం లభించింది. ఈ ఆధిక్యం ఆధారంగా, కేరళ ఫైనల్‌లోకి ప్రవేశించగలిగింది. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ 2017 సంవత్సరంలో ఒక కొత్త రూల్ తీసుకొచ్చింది. ఈ రూల్ ప్రకారం బంతి ఫీల్డర్ హెల్మెట్‌ను తాకి క్యాచ్ పట్టినా రన్ అవుట్ చేసినా అది అవుట్‌గాని చూస్తారు. ఈ రూల్ ప్రకారం కేరళ జట్టు 74 ఏళ్ల తర్వాత రంజీ ట్రోఫీ ఫైనల్‌కు చేరుకుంది. కేరళ క్రికెట్ జట్టు 1950 సంవత్సరంలో ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆ జట్టు రంజీ ట్రోఫీ ఫైనల్‌కు చేరుకోలేదు. ఇప్పుడు తొలిసారి ఫైనల్‌లో ఆడబోతోంది.



# హార్దిక్‌ను ట్రోల్ చేస్తున్న నెటిజన్లు

ఛాంపియన్స్ ట్రోఫీ తొలి మ్యాచ్‌లో శుభ్‌మాన్ గిల్ 101 పరుగులతో అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. బంగ్లాదేశ్‌పై గిల్ చేసిన ఈ సెంచరీలో 2 సిక్సర్లు, 9 ఫోర్లు బాదాడు. ఈ అద్భుతమైన ఇన్నింగ్స్‌తో గిల్‌కు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ వరించింది. గిల్ చేసిన ఈ సెంచరీలో కేఎల్ రాహుల్ పాత్ర చాలా ఎక్కువ ఉందని సోషల్ మీడియాలో అభిమానులు కితాబు ఇస్తున్నారు. గిల్ తన సెంచరీ పూర్తి చేయడానికి తన అర్ధ సెంచరీని రాహుల్ త్యాగం చేశాడు. ఒక వేళ రాహుల్ ఔటై ఉంటే హార్దిక్ పాండ్యా వచ్చే వాడని అతను పెద్ద షాట్లు ఆడేవాడని ట్రోల్ చేస్తున్నారు. హార్దిక్ వచ్చి ఉంటే మాత్రం గిల్ సెంచరీ గురించి మర్చిపోవాల్సిందనంటూ సెటైర్లు వేస్తున్నారు. 229 పరుగుల లక్ష్యంతో భరిలోకి దిగిన భారత్‌కు రోహిత్ శర్మ, గిల్ అద్భుతమైన ఆరంభాన్ని అందించారు. వీరిద్దరూ కలిసి తొలి వికెట్‌కు 69 పరుగులు జోడించారు. ఈ జోడీ జోరు మీద ఉన్న టైంలో రోహిత్ వికెట్ పడింది. ఆ తర్వాత మ్యాచ్ కాస్త నెమ్మదించింది. ఇలా 144 పరుగుల వద్ద నాల్గు వికెట్లను కోల్పోయింది టీమిండియా. ఒకవైపు వికెట్లు పడుతుంటే గిల్ మాత్రం ఏకాగ్రతతో ఆడుతూ వచ్చాడు. తర్వాత అతనికి కెఎల్ రాహుల్ మంచి మద్దతు ఇచ్చాడు. దీంతో ఇద్దరూ కలిసి జట్టును విజయపథంలోకి తీసుకెళ్లారు. రాహుల్ 47 బంతుల్లో 41 పరుగులు చేశాడు. కెఎల్ రాహుల్ తన అర్ధ సెంచరీ గురించి ఏ మాత్రం పట్టించుకోలేదు. శుభ్‌మాన్ గిల్ సెంచరీ పూర్తి చేసేలా సహకారం అందించాడు ఇదే విషయాన్ని సోషల్ మీడియా వేదికగా అభిమానులు రాసుకొస్తున్నారు. రాహుల్ ఔట్ అయ్యి, హార్దిక్ పాండ్యా మైదానంలోకి వచ్చి ఉంటే దూకుడుగా ఆడేవాడని గుర్తు చేస్తున్నారు. ఈ దూకుడుతో గిల్ సెంచరీ కోల్పోవాల్సి వచ్చేదని అంటున్నారు. "2023 ప్రపంచ కప్‌లో కూడా విరాట్ కోహ్లీ సెంచరీకి రాహుల్ సహకరించిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు అభిమానులు. అప్పుడు కూడా తన అర్ధ సెంచరీ గురించి కెఎల్ రాహుల్ పట్టించుకోలేదు ఇప్పుడు కూడా అదే చేశాడని అంటున్నారు.




# ఐపీఎల్‌లో ఆడాలని ఉంది: ఆస్ట్రేలియా కెప్టెన్ పాట్ కమిన్స్ ఆశాభావం

గాయం నుంచి త్వరగా కోలుకొని 2025 ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్?) కల్లా అందుబాటులోకి రావాలని ఉందంటూ ఆస్ట్రేలియా కెప్టెన్ పాట్ కమిన్స్ ఆశాభావం వ్యక్తం చేశాడు. చీలమండ గాయం కారణంగా 2025 ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీకి దూరమైన కమిన్స్ ప్రస్తుతం నెమ్మదిగా కోలుకుంటున్నాడు. దీంతో తన టైమ్?ను ఇప్పుడు ఈ సమయాన్ని రికవరీ కోసం అలాగే ఫ్యామిలీతో గడిపేందుకు ఉపయోగించుకున్నట్లు పేర్కొన్నాడు. ఈ బ్రేక్‌ని రాబోతున్న కీలక టోర్నీలు ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్, ఐపీఎల్‌కి ముందు పూర్తిగా కోలుకునేందుకు లభించిన అవకాశంగా భావిస్తున్నాడు. ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు ఆస్ట్రేలియాకు గట్టి ఎదురుదెబ్బలు తగిలాయి. కమిన్స్ సహా ఫాస్ట్ బౌలర్ హేజిల్‌వుడ్, ఆల్-రౌండర్లు మార్కస్ స్టొయినస్, మిచెల్ మార్ష్ వంటి కీలక ఆటగాళ్లను కోల్పోయింది. కమిన్స్ స్థానంలో వైస్ కెప్టెన్ స్టీవెన్ స్మిత్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు.ఇటీవల పాట్ కమిన్స్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, 'ఇది నాకు ఓ అద్భుతమైన నెల. ట్రైనింగ్ లేదా రాబోయే పర్యటన గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఎలాంటి ఆలోచనలు లేకుండా పూర్తిగా ఫ్యామిలీతో సమయం గడపడం నిజంగా ప్రత్యేకమైంది. వచ్చే వారం నుంచి బౌలింగ్ చేయడం ప్రారంభించాలి. క్రమంగా కోలుకుని ఐపీఎల్‌కి సిద్ధంగా ఉండాలి.' అని చెప్పాడు. మొదట ఛాంపియన్స్ ట్రోఫీకి ఎంపికైన ఆస్ట్రేలియా టీమ్‌లో కమిన్స్ ఉన్నాడు. తర్వాత అతడి ఫిట్‌నెస్‌పై సందేహాలు తీరకపోవడంతో పక్కన పెట్టారు. బోర్డర్-గావస్కర్ ట్రోఫీ తర్వాత అతడు గాయపడ్డాడు. అతడి కెప్టెన్సీలో 2025 జనవరిలో ఆస్ట్రేలియా భారత్‌పై 3-1 తేడాతో టెస్ట్ సిరీస్ గెలిచింది. ఛాంపియన్స్ ట్రోఫీలో ఆస్ట్రేలియా తన మొదటి మ్యాచ్ ఫిబ్రవరి 22న లాహోర్‌లో ఆడుతుంది. గ్రూప్ బీలోని మరో జట్టు ఇంగ్లండ్‌తో తలపడుతుంది. ఈ తరుణంలో కమిన్స్ ఇంకా రికవరీలోనే ఉన్నాడు. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ రానుండటంతో కమిన్స్ రికవరీకి క్రికెట్ ఆస్ట్రేలియా తగినంత సమయం ఇవ్వాలని భావించింది.



# గంగూలీకి త్రుటిలో తప్పిన ప్రమాదం

**- దుర్గాపూర్ ఎక్స్‌ప్రెస్ వేపై కారు ప్రమాదం**



టీమ్‌ఇండియా మాజీ ప్లేయర్, బీసీసీఐ మాజీ చీఫ్ సౌరభ్ గంగూలీకి త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. గురువారం రాత్రి ఆయన బుర్ద్వాన్ వెళ్తుండగా, దుర్గాపూర్ ఎక్స్‌ప్రెస్ వేపై ఆయన కారు ప్రమాదానికి గురైంది. అయితే ఈ ప్రమాదంలో గంగూలీకి ఎలాంటి గాయాలు కాలేదు. ఆయన సురక్షితంగా బయటపడ్డారు. అయితే ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. ఓ ఈవెంట్?కు హాజరయ్యేందుకు గంగూలీ బుర్ద్వాన్? వెళ్తున్నారు. హైవేపై ఆయన ప్రయాణిస్తున్న ఈ క్రమంలో ఓ ట్రక్కు అడ్డు రావడం వల్ల ఆయన సడెన్ బ్రేకులు వేయాల్సి వచ్చింది. దీంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ క్రమంలోనే వెనుక నుంచి వస్తున్న వాహనాలు ఒకదానికొకటి ఢీ కొడుతూ గంగూలీ కారును బలంగా తాకాయి. అదృష్టవశాత్తూ కారులో ఉన్న వారెవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. కానీ, కారు తీవ్రంగా దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. అయితే ప్రమాదం జరిగిన సమయంలో వర్షం కురిసినట్లు తెలిసింది.

# బ్యాటింగ్ చేస్తున్నప్పుడు డ్రెస్సింగ్ రూమ్ నుంచి మెసేజ్ వచ్చింది

**- శుభ్‌మన్ గిల్ కీలక వ్యాఖ్యలు**

ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025ని టీమిండియా ఘనంగా ఆరంభించింది. తాజాగా దుబాయ్ వేదికగా బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్ లో 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. బౌలింగ్‌లో షమీ 5 వికెట్లతో చెలరేగి ఆడగా.. బ్యాటింగ్‌లో శుభ్‌మన్ గిల్ అదిరే శతకంతో మెరిశాడు. చివరి వరకు క్రీజులో ఉండి జట్టుకు విజయాన్ని అందించాడు. ఈ నేపథ్యంలో తన ప్రదర్శనపై సంతోషం వ్యక్తం చేశాడు శుభ్‌మన్ గిల్. తాను బ్యాటింగ్ చేస్తున్నప్పుడు డ్రెస్సింగ్ రూమ్ నుంచి వచ్చిన మెసేజ్ గురించి తెలిపాడు. "నేను ఆడిన అత్యంత సంతృప్తికరమైన ఇన్నింగ్స్‌లలో ఇదీ ఒకటి. ఐసీసీ ఈవెంట్లలో నా తొలి సెంచరీ. నా ప్రదర్శనతో చాలా చాలా ఆనందంగా ఉన్నాను. నేను, రోహిత్ భాయ్ క్రీజులోకి వెళ్లినప్పుడు.. ఆఫ్ స్టంప్ వెలుపల ఉన్న బంతులు బ్యాట్‌పైకి రాకపోవడంతో బంతిని కట్ చేయడం అంత సులభం కాదని భావించాం. అందుకే నేను ఫాస్ట్ బౌలర్లపై ముందుకు వెళ్లి ఆడటానికి ప్రయత్నించాను. ఆ తర్వాత స్పిన్నర్లు వచ్చినప్పుడు, ఫ్రంట్ ఫూట్ తో సింగిల్స్ తీయడం అంత సులువు కాదని నేను కోహ్లీ మాట్లాడుకున్నాం. అందుకే బ్యాక్ ఫూట్ తో సింగిల్స్ తీసేందుకు ప్రయత్నించాం. ఓ దశలో మాపై కాస్త ఒత్తిడి ఏర్పడింది. అప్పుడు ఓ బ్యాటర్ చివరి వరకు క్రీజులో ఉండి బ్యాటింగ్ చేయాలని డ్రెస్సింగ్ రూమ్ నుంచి సందేశం వచ్చింది. నేను అదే చేశాను. ఇక నేను బాదిన రెండు సిక్స్ లలో మొదటి నాలో చాలా కాన్ఫిడెన్స్ ఇచ్చింది. రెండోది నేను సెంచరీ దగ్గర అవ్వడానికి తోడ్పడింది. ఫైనల్ గా రెండు నాకు ఎంతో సంతృప్తినిచ్చాయి." అని మ్యాచ్ అనంతరం తన ప్రదర్శన గురించి గిల్ హర్షం వ్యక్తం చేశాడు. బంతితో షమి (5/53), బ్యాటుతో శుభ్‌మన్ గిల్ (129 బంతుల్లో 9x4, 2x6 సాయంతో 101 నాటౌట్) అద్భుతంగా రాణించి.. బంగ్లాదేశ్ పై భారత జట్టు గెలవడంలో కీలకంగా వ్యవహరించారు. షమితో పాటు హర్షిత్ రాణా (3/31), అక్షర్ పటేల్ (2/43) కూడా చెలరేగి ఆడారు. దీంతో బంగ్లాదేశ్.. 49.4 ఓవర్లలో 228 పరుగులకు ఆలౌట్ అయింది. బ్యాటర్లలో హృదోయ్ (118 బంతుల్లో 6x4, 2x6 సాయంతో 100), జేకర్ అలీ (114 బంతుల్లో 4x4 సాయంతో 68) సెంచరీలో మెరవడంతో బంగ్లా ఆ స్కోర్ చేసింది. అనంతరం లక్ష్యాన్ని 46.3 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది టీమిండియా.

# విరాట్ కోహ్లీ అద్భుతమైన బ్యాటర్

- **దేశం కోసం ఎన్నో కీలక ఇన్నింగ్స్‌లు ఆడాడు**
- **ఛేజింగ్‌లో మాత్రం సచిన్ కంటే కోహ్లీనే గొప్ప**
- **మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్**

టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీపై మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ ప్రశంసల జల్లు కురిపించాడు. విరాట్ కోహ్లీ అద్భుతమైన బ్యాటర్ అని, దేశం కోసం ఎన్నో కీలక ఇన్నింగ్స్‌లు ఆడాడని కొనియాడాడు. సచిన్ టెండూల్కర్ తనకు రోల్ మోడల్ అని చెప్పిన సెహ్వాగ్.. ఛేజింగ్‌లో మాత్రం సచిన్ కంటే కోహ్లీనే గొప్ప అని అభిప్రాయపడ్డాడు. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో భాగంగా బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ 6 వికెట్ల తేడాతో విజయం సాధించిన విషయం తెలిసిందే. బంగ్లాదేశ్ విధించిన 229 పరుగుల లక్ష్యాన్ని 46.3 ఓవర్లలోనే పూర్తి చేసింది. అయితే ఈ లక్ష్యాన్ని టీమిండియా 35 ఓవర్లలోనే పూర్తి చేస్తుందని భావించానని సెహ్వాగ్ తెలిపాడు. ఈ టార్గెట్ ఛేజింగ్ విషయంలో ఏ మాత్రం కంగారు పడలేదని తెలిపాడు. తాజాగా ఓ ఛానెల్‌తో మాట్లాడిన సెహ్వాగ్ ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. 'ప్రతీ ఆటగాడి



ఫేవరేట్, నా రోల్ మోడల్ సచిన్ టెండూల్కర్. అతనితో కలిసి మైదానంలో అడుగుపెడుతుంటే సింహంతో అడవిలోకి వెళ్తున్నట్లు ఉండేది. ప్రతీ ఒక్కరు సచిన్‌ను చూసేవారు. అప్పుడు నేను నిశ్శబ్దంగా పరుగులు చేసేవాడిని. అయితే, లక్ష్య ఛేధనలో మాత్రం సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లీలో ఎవరు అంటే మాత్రం నేను కోహ్లీవైపే మొగ్గు చూపిస్తాను. 2011-12 నుంచి ఇప్పటి వరకు కోహ్లీ చాలా మారిపోయాడు. ముఖ్యంగా అతని ఫిట్‌నెస్, ఆటలో నిలకడ అద్భుతం. దేశం కోసం ఎన్నో కీలక ఇన్నింగ్స్‌లు ఆడాడు.భారత్-బంగ్లాదేశ్ మ్యాచ్‌లో నేను ఏ దేశలో కంగారు పడలేదు. ఎందుకంటే ప్రత్యర్థి బంగ్లాదేశ్. నేను ఆడే సమయంలోనే బంగ్లాదేశ్‌ను చూసి ఎప్పుడూ భయపడలేదు. అలాంటిది ఇప్పుడు ఎలా టెన్షన్ పడుతాను. అసాధారణ ప్రదర్శన చేయడానికి బంగ్లాదేశ్ ఏమైనా పాకిస్థానా? ఆస్ట్రేలియానా? మ్యాచ్‌లో భారత్ నాలుగు వికెట్లు కోల్పోయినా సరే ఇబ్బందేమి లేదు. అయితే చాలా తేలికగా విజయం సాధించాల్సిన మ్యాచ్. రోహిత్, విరాట్, శ్రేయస్ అయ్యర్‌లో ఒకరు క్రీజులో ఉండుంటే భారత్ 35 ఓవర్లలోనే మ్యాచ్ ముగించేది.'అని సెహ్వాగ్ అభిప్రాయపడ్డాడు.




# హరిహర వీరమల్లు నుంచి కొల్లగొట్టినాదిరో..పాట

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'హరిహర వీరమల్లు' నుండి సెకండ్ సింగిల్ 'కొల్లగొట్టినాదిరో' ఫిబ్రవరి 24న విడుదల కాబోతోంది. ఈ సందర్భంగా శుక్రవారం సాంగ్ ప్రోమోను విడుదల చేశారు. కథానాయకుడు పవన్ కళ్యాణ్ తో పాటు కథానాయిక నిధి అగర్వాల్ పై ఈ పాటను నైట్ ఎఫెక్ట్స్ లో చిత్రీకరించారు. విశేషం ఏమంటే... ఇందులో అనసూయ భరద్వాజ్‌తో పాటు పూజిత పొన్నాడ కూడా స్పెషల్ అప్పీయరెన్స్ ఇచ్చింది. 'కోర కోర మీసాలతో, కొదమ కొదమ అడుగులతో... కొంటెకొంటె చణుకులతో, కొలిమి లాంటి మగటిమితో... సరసర వచ్చినాడు చిచ్చర పిడుగంటి వాడు' అంటూ సాగే ఈ పాటను చంద్రబోస్ రాశారు. దీనిని ఎం.ఎం. కీరవాణి స్వరపర్చగా, దీనిని మంగ్లీ , రాహుల్ సిప్లిగంజ్, రమ్య బెహరా, యామిని ఘంటసాల గానం చేశారు.ఏ.ఎం. రత్నం సమర్పణలో ఆయన సోదరుడు దయాకరరావు 'హరిహర వీరమల్లు' సినిమాను నిర్మిస్తున్నారు. రెండు భాగాలుగా ఇది విడుదల కాబోతోంది. తొలి భాగాన్ని మార్చి 28న విడుదల చేయబోతున్నారు.క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహించారు. అయితే బాలెన్స్ ఉన్న చిత్రీకరణ ను పూర్తి చేసే బాధ్యతను ఏ.ఎం. రత్నం తనయు డు జ్యోతికృష్ణ భుజానికి కెత్తుకున్నాడు. పవన్ కళ్యాణ్ పాల్గొనగా నాలుగు రోజుల ఎలాష్ బ్యాక్ ఎపిసోడ్ ఒక్కటి ఇంకా చిత్రీకరించాల్సి ఉందని, అది మినహా మిగిలిన భాగానికి సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ మొత్తం జరుగుతోందని తెలుస్తోంది. ఈ సినిమాలో ఇతర ప్రధాన పాత్రలను బాబీ డియోల్, నాజర్, సునీల్, రఘుబాబు, సుబ్బరాజు, నోరా ఫతేహి తదితరులు పోషించారు.




# మణిరత్నం సినిమాలో ఛాన్స్ కొట్టేసిన నవీన్ పోలిశెట్టి

టాలీవుడ్ యువ కథానాయకుడు నవీన్ పోలిశెట్టి బంపరాఫర్ కొట్టినట్లు తెలుస్తుంది. తాజాగా ఆయన దిగ్గజ దర్శకుడు మణిరత్నంతో సినిమా చేయబోతున్నట్లు సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ, జాతి రత్నలు, మిస్ శెట్టి, మిస్టర్ పోలిశెట్టి సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు నవీన్. సినిమా సినిమాకు గ్యాప్ తీసుకునే నవీన్ ఇటీవల యాక్సిడెంట్ కావడంతో చేయికి గాయం అయ్యింది. దీంతో ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాడు. అయితే నవీన్ ప్రస్తుతం చేస్తున్న చిత్రం అనగనగా ఒకరాజు. మీనాక్షి చౌదరీ ఈ సినిమాలో కథనాయికగా నటిస్తుంది. ఈ సినిమా అనంతరం నవీన్ మణిరత్నం సినిమాలో చేయబోతున్నట్లు తెలుస్తుంది. లవ్ బ్యాక్‌డ్రాప్‌లో రాబోతున్న ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి త్వరలోనే అన్ని వివరాలు వెల్లడించనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. మణిరత్నం విషయానికి వస్తే.. ప్రస్తుతం థగ్ లైఫ్ అనే సినిమను తెరకెక్కిస్తున్నాడు. కమల్ హాసన్, శింబు ప్రధాన పాత్రల్లో వస్తున్న ఈ చిత్రం ఈ సమ్మర్ కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది.

# మేనల్లుడు హీరోగా ధనుష్ దర్శకత్వం

జాబిలమ్మ నీకు అంతకోపమా..బాగుందన్న నటి కీర్తి హీరో ధనుష్ నల్లుడు పవిష్ నారాయణ్ నటుడిగా ఎంట్రీ ఇచ్చిన చిత్రం 'నిలవుకు ఎన్‌మేల్ ఎన్నడి కోబమ్' ధనుష్ దర్శకత్వంలో ఇది తెరకెక్కింది. అనిఖ సురేంద్రన్, ప్రియాప్రకాశ్ వారియర్, మాథ్యూ థామస్ తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. శుక్రవారం ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకువచ్చింది. తాజాగా దీనిని నటి కీర్తిసురేశ్ వీక్షించారు. ఈ సినిమా తనకెంతో నచ్చిందని సోషల్‌మీడియా వేదికగా పోస్ట్ పెట్టారు. ధనుష్ మేకింగ్ స్టైల్‌ను ఆమె మెచ్చుకున్నారు. 'ఇప్పుడే ఈ చిత్రాన్ని వీక్షించాను. సినిమా చాలా కొత్తగా, చూడచక్కగా ఉంది. ధనుష్.. మీ డైరెక్షన్‌లో మరో విభిన్నమైన కథను సృష్టించారు. మీ మేకింగ్ స్టైల్ నాకెంతో నచ్చింది. ఇంతమంది నటీనటులను స్క్రీన్‌పై చూడటం ఎంతో సంతోషంగా ఉంది. పవిష్.. హావభావాలు, వాయిస్, యాక్షన్ ఇలా ప్రతి విషయంలో నువ్వు ధనుష్‌ని గుర్తుచేశావు. అద్భుతమైన చిత్రంతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టావు. మాథ్యూ థామస్.. నీ పాత్ర ప్రేక్షకులకు ఎంతగానో గుర్తుండి పోతుంది. ప్రియాంకా మోహన్.. నీ డ్యాన్స్ అదిరింది. టీమ్ అందరికీ అభినందనలు' అని ఆమె రాసుకొచ్చారు. ఇదే చిత్రం తెలుగులో 'జాబిలమ్మ నీకు అంత కోపమా' అనే పేరుతో విడుదలైంది. రొమాంటిక్ కామెడీ కథతో దీనిని సిద్ధం చేశారు. 'రాయన్' తర్వాత ధనుష్ దర్శకత్వం వహించిన చిత్రమిదే కావడంతో ప్రమోషన్స్ సమయంలోనే ప్రేక్షకాదరణను సొంతం



# చిరంజీవి ప్రోత్సాహం మరువలేనిది: సందీప్ కిషన్



మజాకా'తో ప్రేక్షకులను అలరించేందుకు నటుడు సందీప్ కిషన్ సిద్ధమయ్యారు. ఈ మూవీ మహాశివరాత్రి సందర్భంగా ఫిబ్రవరి 26న ఇది విడుదల కానుంది. ఈసందర్భంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సందీప్‌కిషన్ పలు విశేషాలు పంచుకున్నారు. కెరీర్‌లో తాను ఎన్నో ఎత్తుపల్లాలు చూశానని అన్నారు. ప్రస్తుతం మంచి ప్రాజెక్ట్‌లు చేస్తున్నానని తెలిపారు. ఎవరి సపోర్ట్ లేకుండా నేను పరిశ్రమలోకి వచ్చాను. కెరీర్ పరంగా ఎత్తుపల్లాలు చూశాను. 'ఒక్క అమ్మాయి తప్ప' సినిమా ముందు వరకూ ఎంతోమంది దర్శక, నిర్మాతలు తమ కథలను నాతో పంచుకునేవారు. కథలపై నాకొక మంచి జడ్జిమెంట్ ఉంటుందని వారు నమ్మేవారు. కానీ ఆ తర్వాత పరిస్థితి మారిపోయింది. నా సినిమాలు వరుస పరాజయాలు అందుకోవడంతో నా జడ్జిమెంట్ సరైనది కాదని వారు భావించారు. కెరీర్‌లో వరుస అపజయాలు, రిలేషన్‌షిప్ బ్రేకప్.. జీవితంలో ఏం జరుగుతుందో అర్థంకాక ఎంతో బాధపడ్డా. రోజుకు అరకిలో ఐస్‌క్రీమ్, చాక్లెట్స్ తినేశా. నా బరువు 97 కిలోలకు చేరింది. ఆ సమయంలో నా స్నేహితుడు రూ.కోటి ఇస్తే 'నిను వీడని నీడను నేనే' చేసి రూ.6 కోట్లు రాబట్టా. అక్కడినుంచి జాగ్రత్తగా కథలు ఎంచుకుంటూ కష్టపడుతున్నా' అని సందీప్ కిషన్ అన్నారు. కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ తనయుడు జేసన్ సంజయ్ దర్శకుడిగా తెరకెక్కిస్తోన్న చిత్రంలో యాక్ట్ చేయడంపై మాట్లాడుతూ.. ఆ సినిమా చిత్రీకరణ మొదలుపెట్టామంతే. వరుస ప్రాజెక్ట్‌ల వల్ల నా డేట్స్ సర్దుబాటు చేయడం వీలుపడలేదు. త్వరలోనే ఆ సెట్‌లోకి అడుగుపెడతా. 'మజాకా' షూట్ సమయంలో ఓసారి అనుకోకుండా అగ్ర కథానాయకుడు చిరంజీవిని కలిశాను. మా మధ్య మంచి అనుబంధం ఉంది. 'మజాకా' కథ చేస్తున్నందుకు నన్ను మెచ్చుకున్నారు. ఈ కథ తనకెంతో నచ్చిందని.. తాను చేయలేకపోయినందుకు బాధపడ్డానని తెలిపారు. 'సంజయ్‌తో నువ్వు సినిమా చేస్తున్నావని తెలిసింది. ఒక తెలుగు హీరోతో వాళ్లు సినిమా చేయాలనుకుంటున్నారంటే మనం గర్వపడాల్సిన విషయం' అన్నారు. ఆ మాట నాకెంతో ఆనందాన్ని ఇచ్చింది. నేను ఆ విధమైన ప్రశంసలనే అందరి నుంచి కోరుకుంటున్నా అని చెప్పారు.





# ఓటిటిలోకి వస్తోన్న ఎమర్జెన్సీ

కంగనా రనౌత్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఎమ్జర్గ÷న్సీ'. పలుమార్లు వాయిదా పడుతూ వచ్చి చివరకు జనవరి 17న థియేటర్లలో విడుదలై బాక్సాఫీస్ వద్ద మిశ్రమ స్పందనలకే పరిమితమైంది. త్వరలో ఇది ఓటీటీ వేదికగా ప్రేక్షకులకు అందుబాటులో ఉండనుందని కంగన తాజాగా ప్రకటించారు. నెట్‌ప్లిక్స్ వేదికగా మార్చి 17 నుంచి ఇది స్ట్రీమింగ్ కానుందని తెలిపారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ రాజకీయ జీవితాన్ని ఆధారంగా చేసుకొని 'ఎమర్జెన్సీ' చిత్రాన్ని రూపొందించారు. అత్యవసర పరిస్థితి ప్రకటించిన సందర్భాన్ని ఆధారంగా చేసుకొని దీనిని సిద్ధం చేశారు. ఇందిరాగాంధీగా కంగనా నటించగా.. జయప్రకాశ్ నారాయణ్ పాత్రలో అనుపమ్ ఖేర్, అటల్ బిహారీ వాజ్‌పేయీగా శ్రేయాస్ తల్పడే నటించారు. ఎన్నో అంచనాల మధ్య విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయింది. రూ.60 కోట్లతో దీనిని రూపొందించగా.. రూ.21 కోట్లు మాత్రమే ఈ సినిమా రాబట్టినట్లు అంచనా.

# అంజనాదేవికి ఏమీ కాలేదు

**- సోషల్ మీడియా వార్తలపై చిరుటీమ్ స్పందన**

మెగాస్టార్ చిరంజీవి తల్లి అంజనాదేవి అస్వస్థతకు గురైయినట్లు ఉదయం నుంచి సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అయ్యాయి. శుక్రవారం తెల్లవారుజామున అంజనాదేవి అస్వస్థతకు గురవడంతో కుటుంబసభ్యులు నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించినట్లు.. వైద్యులు ప్రస్తుతం అంజనమ్మకి చికిత్స అందిస్తున్నట్లు వార్తలు వచ్చాయి. అయితే ఈ వార్తలపై చిరంజీవి టీమ్ తాజాగా స్పందించి స్పష్టత ఇచ్చింది. అంజనాదేవి అస్వస్థతకు గురైయినట్లు వస్తున్న వార్తల్లో నిజం లేదని తెలిపింది. రెగ్యులర్ చెకప్‌లో భాగంగానే గత వారం అంజనమ్మను ఆస్పత్రికి తీసుకెళ్లినట్లు తెలిపింది. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం బాగానే ఉందని చిరంజీవి టీమ్ వెల్లడించింది.

